MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 22 సంచిక: 1 రంగారెడ్డి సెప్టెంబర్ 2023 పేజీలు : 36 వెల : రూ. 10/-

## ఏపిమాస్ హ్యాట్రిక్ !

ఒకే నెలలో ... మూడు రాష్ట్రాలలో ... ఎఫ్ పి ఓలకు ఎస్ బి ఐ తో అనుసంధానం !!







తిరుపతి... ఆంధ్రప్రదేశ్




పాట్నా... బీహార్



హైదరాబాద్ ...తెలంగాణా



అస్సాంలో ఆ రాష్ట్రస్థాయి రిసోర్స్‌పర్సన్స్‌కు (ఏ ఎస్ ఆర్ ఎల్ ఎం)
5 రోజులపాటు ఏపిమాస్ శిక్షణలో ఒక దృశ్యం

## అమెరికాలో ఏపిమాస్ !

- నెలరోజులపాటు ప్రచార ప్రస్థానం !
- నూతన భాగస్వామ్యాలు కూడా ...
- శ్రీ సి ఎస్ రెడ్డి నేతృత్వం



తొలి అడుగు ...

NABARD

నాబార్డ్ సౌజన్యంతో ....

# భూమి, నీటి సంరక్షణ మరియు యాజమాన్యం

భూమిలో సారం ... మొలకకు ఆధారం

కీలక దశలో అందే నీరే పెరిగే పంటకు జీవం

## చేపట్టే పనులు

## నీటి సంరక్షణ - యాజమాన్యం

## భూసార, నీటి సంరక్షణ




NABARD

# మహిళా సాధికారత

సంపుటి 22 సంచిక 1




సంపాదకీయం

## అనుసంధానం !!

అర్ధబలం,అంగబలం, ఆలోచనా బలం వుంటే కాని ఏ వ్యక్తి అయినా, వ్యవస్థ అయినా మంచిగా మనుగడ సాగించలేదు, పురోభివృద్ధి సాధించలేదు. వీటిలో ఒకటి వుంటే మరొకటి లేక ఎన్నో వ్యవస్థలు, సంస్థలు ముందడుగు వేయలేకపోతుంటాయి. ఎక్కడైనా, వున్న వనరులకు అనుగుణంగానే ఆదాయం వుంటుంది. ఆదాయాన్ని పెంచుకోవాలన్నా, మరిన్ని వనరులు, సదుపాయాలు సమకూర్చుకోవాలన్నా మరింత పెట్టుబడి అవసరమవుతుంది. సమస్య మళ్ళీ మొదటికే వస్తుంది. వున్న కొద్దిపాటి నిధులు నిర్వహణ ఖర్చులకే చాలకపోతుంటే, లేదా బొటాబొటిగా సరిపోతుంటే, యిక నవ కల్పనల ఊసు ఎక్కడినుంచి వస్తుంది? కాని ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దుకోకపోతే, సమాజంలో పోటీని తట్టుకుని నిలబడకపోతే, ముందడుగు సంగతి అటుంచితే, వెనుకబడి, అసలు కనుమరుగై పోయే ప్రమాదం వుంటుంది. ఈ దుస్థితి రాకుండా వుండాలంటే, మరిన్ని పెట్టుబడులు పెట్టక తప్పదు. కాని. యిందుకోసం మన దగ్గర నిధులు చాలినంతగా లేవనుకున్నప్పుడు వెలుపలి నుంచి ఆర్ధిక సహాయాన్ని స్వీకరించి, ఆ నిధులను అభివృద్ధికోసం మాత్రమే వినియోగిస్తూ, ఆర్ధిక క్రమశిక్షణను పాటించి తిరిగి చెల్లింపులు చేస్తూ, మరిన్ని పెట్టుబడులకు మార్గాన్ని సుగమం చేసుకోవాలి. అప్పు తప్పు అనే అభిప్రాయం మన సమాజంలో ఒకప్పుడు చాలా గట్టిగా వుండేది. అయితే, అయినదానికి కానిదానికి అప్పుచేయడం తప్పు కావచ్చునేమో కాని, అభివృద్ధికోసం అప్పుచేయడం తప్పు కాదు. లేకుంటే , ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఎదుగూ బొదుగు లేకుండా వుండడమే మిగిలేది. అందుకే అభివృద్ధి పథంలో ముందుకు సాగాలనుకునే సంస్థలేవైనా బ్యాంకులనుంచో లేదా యితర ప్రామాణిక ఆర్ధిక సంస్థలనుంచో అవసరమైన మేరకు రుణాలు తీసుకుని ప్రగతి గమనం సాగించాలనుకుంటాయి. ఉదాహరణకు స్వయం సహాయ సంస్థల విషయమే తీసుకుంటే, బ్యాంకులతో అనుసంధానానికి ముందు నాటికి, ఆ తరువాతకు అసలు పోలికే లేనంతగా ఆ సంస్థలు పటిష్ఠమైనాయి. ఇప్పుడు, ఎఫ్ పి ఓలు యిదే పరిస్థితిలో వున్నాయి. వాటి వద్దవున్న మూలధనం వ్యాపారాభివృద్ధి కార్యక్రమాలకు సరిపోదు. వ్యాపారం బాగా సాగకపోతే అశించిన అభివృద్ధి సాధ్యం కాదు. ఇక్కడకూడా పరిష్కారం రుణ సహాయమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎఫ్ పి ఓలకు అధిక ప్రాధాన్యం యిస్తుండడంతో బ్యాంకులుకూడా వాటికి రుణాల మంజూరుకు పెద్దగా వెనుకాడడంలేదు. కాని, యిటు ఎఫ్ పి ఓలు కాని, అటు బ్యాంకులు కాని నేరుగా పరస్పరం సంప్రతింపులు జరుపుకునే పరిస్థితి లేదు. ఈ అంతరాన్ని భర్తీచేసి , ఎఫ్ పి ఓ లకు రుణాలు లభించేలా చూసి, వాటి అభివృద్ధికి తోడ్పడాలని ఏపిమాస్ సంకల్పించింది. ఆ సంకల్పం పర్యవసానమే ఒకే నెలలో (ఆగస్టులో) మూడు రాష్ట్రాలలో ఎఫ్ పి ఓ లకు భారతీయ స్టేట్ బ్యాంక్ తో అనుసంధానానికి కార్యశాలలను నిర్వహించడం. తిరుపతి, పాట్నా , హైదరాబాదు లలో నిర్వహించిన ఈ కార్యశాలలలో మొత్తం 150 ఎఫ్ పి ఓలు పాల్గొన్నాయి. వీటిలో 133 ఎఫ్ పి ఓలకు స్టేట్ బ్యాంక్ నుంచి రుణ మంజూరు హామీ పత్రాలు లభించడం చాలా ప్రోత్సాహకరమైన విషయం. ఈ ఎఫ్ పి ఓలకు దాదాపు 40 కోట్ల రూపాయలు లభించనున్నాయి. ఈ మూడు కార్యశాలలు యిచ్చిన స్ఫూర్తితో రానున్న కొద్ది నెలలోనే మన దేశంలోని యితర అనేక రాష్ట్రాలలో, ముఖ్యంగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, తమిళనాడు, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిసా, అస్సాం, కేరళ మొదలైన 11 రాష్ట్రాలలో యిలాంటి ఎఫ్ పి ఓ , స్టేట్ బ్యాంక్ అనుసంధాన కార్యశాలలను నిర్వహించాలని ఏపిమాస్ సంకల్పించింది. ఈ విధంగా మొత్తం కనీసం 600 ఎఫ్ పి ఓలకు బ్యాంకులతో అనుసంధానం కలిగించాలని ఏపిమాస్ ఆకాంక్షిస్తున్నది. ఆగస్టు నెలలో మూడు రాష్ట్రాలలో మూడు కార్యశాలలను విజయవంతంగా నిర్వహించడానికి ఎంతగానో సహకరించిన స్టేట్ బ్యాంక్ ఉన్నతాధికారులు శ్రీ శంతను పాండ్సే, శ్రీ యోగేంద్ర స్కిల్కి , శ్రీ సందీప్ లకు నా హృదయపూర్వక ధన్యవాదాలు! ఈ విజయాన్ని త్వరలోనే దేశంలోని యితర రాష్ట్రాలకు కూడా పంచడానికి ఏపిమాస్ సన్నద్ధంగా, సంసిద్ధంగా వున్నది. ఎఫ్ పి ఓల సుస్థిరాభివృద్ధికోసం సర్వవిధాల సహకరించడానికి ఏపిమాస్ కట్టుబడి వుంది.


Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:T.Chandra Sekhar Reddy**


ఇతరులు నిన్ను అర్థం చేసుకోలేదని బాధపడడం కాదు, ముందుగా నిన్ను నీవు అర్థంచేసుకో

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఎల్. భవాని, జి. దివ్యశ్రీ, ఎం. భార్గవి, జి. శ్రీనివాస్, ఎస్. ప్రహ్లాదయ్య

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

సాంకేతిక సహకారం : వి. శశివర్ధన్ సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి

## లోపలి పేజీలలో ....


- ఎఫ్ పి ఓలకు ఎస్ బి ఐ తో రుణానుసంధానం ...05
- అమరచింత రూరల్ మార్ట్ ప్రారంభోత్సవం! ...10
- గ్రామీణ స్థితిగతులపై శిక్షణ ...12
- ఏపిమాస్ 22వ వార్షిక మహాసభ ...14
- ఎఫ్ పి ఓల వార్షిక మహాసభల సంరంభం ! ...16
- పెట్టుబడి లేకుండా లాభాలను అందిస్తున్న జనుము! ...17
- ఏపిమాస్ ఎఫ్పిఓల మహాసభల దృశ్యమాలిక ...18
- పారిశ్రామిక మహిళలకు భారీ రుణాలు ! ...20
- ఒక్కసారి నాటితే నాలుగేళ్లు పండే వరి! ...21
- క్యాన్సర్ ముప్పును తగ్గించే ఎర్రబియ్యం ! ...22
- 40 ఏళ్లు దాటిన మహిళలు...ఆరోగ్యసమస్యలు ...23
- ట్రైనీ ఐఏఎస్ లకు పాఠాలు చెబుతున్న మహిళ ! ...24
- కాసులు కురిపిస్తున్న కంచె పంట ! ...25
- మన నేలలో సిరులు పండిస్తున్న అవకాడో ! ...26
- కరెంట్‌తో పనిలేకుండానే పొలానికి నీళ్లు! ...27
- తెలంగాణాలో వరిసాగు ఉల్టా పల్టా! ...28
- వృద్ధులకు ప్రతి నెలా రూ. 57 వేల పెన్షన్! ...29
- కోర్టు తీర్పుల్లో వివక్ష పదజాలంపై నిషేధం ...30
- జమ్మికుంట రైతుకు ఉత్తమ రైతు పురస్కారం ! ...32
- బాలల, మహిళల సేవలో 'అవని' అనూరాధ! ...33


### 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'**మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్లకు | : | రూ. 200 |
| మూడేళ్లకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | | |
|---|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : | రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


**సానుకూల వైఖరి అంటే కేవలం ఆశాభావమే కాదు, జరిగేదంతా మంచికే అనే వివేచన**

# ఎఫ్ పి ఓలకు ఎస్ బి ఐ తో రుణానుసంధానం !

## అనుసంధాన కర్త ఏపిమాస్ హ్యాట్రిక్ : ఆగస్టు నెలలో మూడు రాష్ట్రాలలో మూడు కార్యశాలల నిర్వహణ

– ఎన్.వినాయక రెడ్డి, ఎస్.ప్రహల్లాద, అలగప్ప మహేష్, జి. శ్రీనివాస్

దేశంలోని ఎఫ్ పి ఓ లు, ఎఫ్ పి సి లు (రైతు ఉత్పత్తిదారుల సంస్థలు) సన్న , చిన్నకారు రైతులకు ముఖ్యంగా అవసరమైన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు, వ్యవసాయ పరికరాలు, పనిముట్లు మొదలగు వాటిని సరసమైన ధరలకు అమ్మి, పంట వ్యయాలను తగ్గించడంలో కీలక భూమిక పోషిస్తున్నాయి. అయితే ఈ రైతు ఉత్పత్తిదారు సంస్థలలో సభ్యుల అవసరాలకు తగ్గట్టు వ్యాపారం చేయుటకు పెట్టుబడి సరిపోవడంలేదు. అందువలనరైతు ఉత్పత్తిదారు సంస్థలకు ఆర్థిక చేయూత



ఇవ్వాలని ఏపిమాస్ సంస్థ నిర్ణయించింది. ఇందులో భాగంగా బ్యాంకులను, రైతు ఉత్పత్తిదారు సంస్థలను ఒకే వేదికపై చేర్చి, వారి మధ్య అనుసంధానాన్ని ఏర్పాటుచేయడం కోసం రెండు తెలుగు రాష్ట్రాలలోను, బీహార్ లోను ఎఫ్ పి ఓలను, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్ బి ఐ) ప్రతినిధులను ఒకే వేదికమీదకు తెచ్చి రాష్ట్రస్థాయి కార్యశాలలను నిర్వహించింది. తెలంగాణా రాష్ట్ర స్థాయి కార్యశాలను ఆగస్టు 1వ తేదీన హైదరాబాదులోను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి కార్యశాలను ఆగస్టు 11వ తేదీన తిరుపతిలోను, బీహార్‌లో ఆ రాష్ట్ర స్థాయి కార్యశాలను ఆగస్టు 20వ తేదీన పాట్నాలోను నిర్వహించారు.

ఈ మూడు కార్యశాలలకు మొత్తం 150 ఎఫ్ పి ఓలు హాజరుకాగా, వీటిలో 133 ఎఫ్ పి ఓలకు ఎస్ బి ఐ నుంచి రుణాల మంజూరుకు సూత్రప్రాయమైన హామీ లభించింది. ఈ ఎఫ్ పి ఓలకు మొత్తం 40 కోట్ల రూపాయల రుణాలను సమకూర్చడానికి ఎస్ బి ఐ ఆమోదం తెలిపింది.

**కార్యశాల ఉద్దేశాలు :**

1. రైతు ఉత్పత్తిదారు సంస్థల పాలకవర్గ సభ్యులకు, సిబ్బందికి వారి సంస్థల వ్యాపార నిర్వహణకు ఋణం ఆవశ్యకతపై అవగాహన కలిగించడం
2. ఎఫ్ పి ఓలకు బ్యాంకులు అందించే వివిధ రకాల ఆర్థిక, ఆర్థికేతర సేవలు, రుణాలపై అవగాహన కలిగించడం
3. అర్హత కలిగిన రైతు ఉత్పత్తిదారు సంస్థలను మదింపు చేసి వాటికి రుణ హామీ పత్రాలు యిప్పించడం
4. బ్యాంకులకు, రైతు ఉత్పత్తిదారు సంస్థలను మధ్య సత్సంబంధాలు నెలకొనేలా చూడడం

**తిరుపతి కార్యశాల విశేషాలు**

ఈ కార్యశాలకు ముంబై భారతీయ స్టేట్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ శంతను పాండ్యే, అమరావతి సర్కిల్, డిప్యూటి జనరల్ మేనేజర్ శ్రీమతి హేమ, అమరావతి డిప్యూటి జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్, తిరుపతి డిప్యూటి జనరల్ మేనేజర్ శ్రీ వరదరాజన్, తిరుపతి సర్కిల్ నుండి దాదాపు 15 మంది మేనేజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఏపిమాస్ నుండి ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీసి.ఎస్.రెడ్డి, కన్సల్టెంట్ శ్రీ ఎ.మహేష్, ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్ట్ సంచాలకులు శ్రీ ఎన్.వినాయక రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్లు డా.ఎస్.ప్రహల్లాద, శ్రీ జి.ఆర్.అమరేంద్రుడు,

- హాజరైనరైతు సంస్థలు : 62
- ఋణం కోరిన సంస్థలు : 59
- ఋణం హామీ పత్రాలు పొందినవి : 59
- ఋణం హామీ మొత్తం: రూ 20 కోట్లు

డా.ఎం.భార్గవి, డా.జి.గంగాద్రి, శ్రీ సి.గోపాలరాజు, బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్లు శ్రీ మధుసూదన్ రెడ్డి, శ్రీ గిరి, శ్రీ సంజీవ పాల్గొన్నారు.

ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎం.మోహన్, రాస్, తిరుపతి, శ్రీ సి.చంద్రశేఖర్‌రెడ్డి, సి.ఆర్.ఈ. పీలేరు, శ్రీ కే.వి.రమణ, ప్రగతి, తిరుపతి, శ్రీమతి సునంద, మాస్. శ్రీమతి రజిని, నారి, తిరుపతి, మరియు 62 రైతు ఉత్పత్తిదారు సంస్థల నుండి అధ్యక్షులు మరియు సి.ఈ.ఓ లు పాల్గొన్నారు.



**రైతు ఉత్పత్తిదారు సంస్థల స్థితి :**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 1000 రైతు ఉత్పత్తిదారు సంస్థలు వున్నాయి. వీటిలో దాదాపు సగం మాత్రమే చురుకుగా పని చేస్తున్నవి. ఈ సంస్థలకు సామర్థ్య పెంపుదల కార్యక్రమాలు చాలా అవసరం. ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థలో వాటాధనం రూ.లు 5 లక్షల నుండి 10 లక్షల వరకు వున్నది. ఇది సంస్థ వ్యాపార అవసరాలకు ఏమాత్రము సరిపోదు. అందువల్ల బ్యాంకు రుణాలు అత్యవసరం.

కొన్ని సంస్థలు నాబార్డు, ఎస్.ఎఫ్.ఎ.సి, ఎన్.సి.డి.సి మొదలగు వారి నుండి తమ వ్యాపారాలకు నిధులను, ఈక్విటి గ్రాంట్‌లను పొందుచున్నప్పటికి, చాలావాటికి ఈ సదుపాయం లేదు. ప్రతి సంస్థ కూడా వ్యాపార అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసుకోవాలి. ఇందులో మార్కెటింగ్, శిక్షణలు, నిధులు సమకూర్చుకొనుట, పుస్తక నిర్వహణ మొదలగు వాటిని చేర్చుకోవాలి.

రైతు ఉత్పత్తిదారు సంస్థలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినది. చాలావరకు ఎఫ్.పి.ఓ లు వాటిని నిర్మించి, నిర్వహిస్తున్నాయి.

**భారతీయ స్టేట్ బ్యాంక్ స్థితి :**

భారతీయస్టేట్ బ్యాంక్ దేశంలో 215 సంవత్సరాలకు పూర్వమే ఏర్పాటైన అతి పురాతనమైన బ్యాంక్.

ఈ బ్యాంక్‌కు మన దేశంలో ప్రస్తుతం 22000 శాఖలు 72000 ఏటీఎంలు మరియు 60000 బిసిలు కలిగి దేశాభివృద్ధికి పాటుపడుతున్నది. రైతులకు కావలసిన అన్ని రకాల రుణ సేవలు అందిస్తున్నది.

స్టేట్ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ శంతను మాట్లాడతూ ... 'ఈరోజు సమావేశానికి 62 రైతు ఉత్పత్తిదారు సంస్థల ప్రతినిధులు వచ్చారు. ఒక్కొక్క రైతు ఉత్పత్తిదారు సంస్థలో సగటున 500 మంది సభ్యులు వున్నారనుకుంటే మీరు 31000 సభ్యులకు ప్రతినిధులు .కావున 31000 మంది ఈ సమావేశానికి వచ్చినట్లు బావిస్తున్నాము. భారతీయస్టేట్ బ్యాంక్ రైతు ఉత్పత్తిదారు సంస్థలకు ఆర్థిక సహాయము అందించడానికి మీ ముందుకు వచ్చింది' అని అన్నారు.

ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థ కూడా కూరగాయల మార్కెటింగ్ చేయాలని, అప్పుడే సభ్య రైతులకు సేవ చేసినట్లని, ప్రతి సంవత్సరం 25 కోట్ల రూపాయల వ్యాపారం చేసినపుడే సంస్థలు నిలబడగలుగుతాయని, సంవత్సరంలో 12 నెలలు మార్కెటింగ్ చేపట్టాలని సూచించారు. వీటితో పాటు ప్రైమరీ ప్రాసెసింగ్ , విలువ పెంపు కార్యక్రమాలు సంస్థ సుస్థిరతకు తోడ్పడుతాయని ఆయన అన్నారు.

"అమూల్" సంస్థను ఆయన ఉదాహరణగా పేర్కొంటూ, అమూల్ రైతుల నుండి కేవలం పాలను మాత్రమే సేకరించి దాదాపు 400 రకాల వివిధ ఉత్పత్తులను తయారుచేస్తూ

పదవి, అధికారం, సంపద శాశ్వతం కావు; చక్కని వ్యక్తిత్వం, వివేకం మనిషిని చిరంజీవిని చేస్తాయి




ప్రపంచవ్యాప్తంగా అందరి మన్నలను పొందుతున్నదని, ఆ దిశగా విలువ పెంపు విధానాలతో రైతు ఉత్పత్తిదారు సంస్థలు ముందడుగు వేయాలని హితవు పలికారు. నష్టాలు వచ్చే సంస్థలకు ఏ బ్యాంకులూ రుణాలు ఇవ్వవని ఆయన హెచ్చరికగా చెప్పారు.

భారతీయస్టేట్ బ్యాంక్ వివిధ రకాల ప్రభుత్వ పథకాల అమలుకు రుణాలు మంజూరు చేస్తున్నదని, ఉదాహరణకు పిఎంఎఫ్ఎంఇ పథకంలో ప్రభుత్వం 35% సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన 65% ఎఫ్.పి.ఓ లు భరించాలి. అందువలన ఆ మొత్తాన్ని బ్యాంకులు రుణంగా యిస్తాయని ఆయన వివరించారు

**రుణాలు ఇచ్చే విధానం**

'సంరక్షణ్' అనే పేరుతో 100 మార్కులతో రూపొందించిన రేటింగ్ టూల్ ఆధారంగా బ్యాంక్‌లు ఎఫ్.పి.ఓలకు రుణ అర్హతను నిర్ణయిస్తాయని, రుణాలు పొందడానికి క్రింది షరతులు వర్తిస్తాయని ఆయన చెప్పారు.

- ఎఫ్.పి.ఓ రేటింగ్ టూల్‌లో కనీసం 65 మార్కులు రావాలి, ఎక్కువ వస్తే మరీ మంచిది.
- ఎఫ్.పి.ఓలో సభ్యుల సంఖ్య కనీసం 300 వుండాలి. ఎఫ్.పి.ఓ వయసు కనీసం 6 నెలలు వుండాలి.
- గరిష్ఠ ఋణ పరిమితి ఎఫ్.పి.ఓకు 2 కోట్ల రూపాయలు
- కేంద్ర ప్రభుత్వానికి చెందిన యం ఎస్ యం ఇ శాఖలో ఎఫ్.పి.ఓ నమోదై వుండాలి.

**బ్యాంక్‌లతో ఎఫ్.పి.ఓలు ఎదుర్కొంటున్న సమస్యలు**

- క్షేత్ర స్థాయి బ్యాంక్ సిబ్బందికి రైతు ఉత్పత్తిదారు సంస్థల గురించి, వాటి కార్యక్రమాలగురించి అవగాహన లేదు.
- పది మంది సభ్యులున్న మహిళా సంఘాలకు రూ.20 లక్షలు రుణాలు ఇస్తున్నారు గాని 300 మంది నుండి 1000 మంది వున్న రైతు సంస్థలకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు సుముఖంగా లేవు.
- కొన్ని మండలాలలో భారతీయ స్టేట్ బ్యాంక్ శాఖలు లేవు. ప్రక్క మండలాల వారు వచ్చి బ్యాంక్‌లో ఖాతాలు ప్రారంభించమంటే బ్యాంక్‌మేనేజర్లు ఒప్పుకోవడం లేదు. మీ మండలంలో మాకు సర్వీస్ లేదు, అక్కడ వేరే బ్యాంకులున్నాయి. మీరు అక్కడకువెళ్ళండని స్టేట్‌బ్యాంక్ మేనేజర్లు చెబుతున్నారు.
- ఉదాహరణకు అనంతపురం జిల్లాలోని బుక్కపట్నం, కొత్తచెరువు, ముదిగుబ్బ, రాయదుర్గం, గుమ్మగడ్డ మండలాలలో ఎఫ్.పి.ఓ.లు వున్నవి కానీ స్టేట్ బ్యాంకు శాఖలు లేవు. ప్రక్కనున్న పట్టణాలకు వెళితే వారు అనుమతించడం లేదు.
- బ్యాంక్‌లు బంగారు తాకట్టు రుణాలకు ఇచ్చే ప్రాధాన్యత వ్యవసాయ రుణాలకు ఇవ్వడం లేదు.
- బ్యాంక్ లో ఎఫ్.పి.ఓ సభ్యులకు కనీస గౌరవం లేదు
- సర్వీస్ ఏరియా ప్రకారం ఖాతాలు ప్రారంభించు కోవాలని బ్యాంక్‌లు ఎఫ్.పి.ఓ లకు సూచిస్తున్నాయి

**రైతు ఉత్పత్తిదారు సంస్థలు ప్రాసెసింగ్ చేపట్టాలి**

'అమెజాన్ ' అనే సంస్థ తనకంటూ ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకుండానే కేవలం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కోట్లలో వ్యాపారం చేస్తున్నది. మన ఎఫ్.పి.ఓలు ఎందుకు చేయకూడదో ఆలోచించాలి. ప్రాథమిక , ద్వితీయ ప్రాసెసింగ్ ద్వారా కూడా కొన్ని సంస్థలు కోట్లు గడిస్తున్నవి.

ఉదాహరణకు ఉత్తరప్రదేశ్‌లోని ధర్మసార అనే గ్రామంలో కరివేపాకు, కొన్ని అటవీ ఉత్పత్తులు దొరుకుతాయి. ఢిల్లి నుండి కొంతమంది వర్తకులు వెళ్లి తక్కువ ధరకు వారివద్ద నుండి కొనుగోలుచేసి వాటిని ప్రాసెసింగ్ చేసి ఢిల్లీలో ఎక్కువ ధరకు అమ్ముతారు. ఫలితంగా అడవి నుండి తెచ్చిన పేద ప్రజలు నష్టపోతున్నారు. అంతిమంగా వాటిని కొన్న వినియోగదారులు అధిక ధరకు కొని నష్టపోతున్నారు. కేవలం మధ్య దళారులు మాత్రమే లాభపడుతున్నారు.

**రైతు ఉత్పత్తిదారు సంస్థలు బలపడాలంటే ...**

- బాగా పనిచేసే రైతు ఉత్పత్తిదారు సంస్థలను మరింతగా ప్రోత్సహించుటకు అటు ప్రభుత్వం గాని , బ్యాంక్‌లు గాని అవార్డులు ప్రకటించాలి
- రైతు ఉత్పత్తిదారు సంస్థలు బ్యాంక్ నుండి రుణాలు తీసుకొనివాటిని ప్రయోజనాత్మకంగా ఉపయోగించాలి. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలి
- భారతీయ స్టేట్ బ్యాంక్ సిబ్బందికి, రైతు ఉత్పత్తిదారు సంస్థల ప్రతినిధులకు మధ్య సత్సంబంధాలు నెలకొల్ప డానికి తరచు సమావేశాలు ఏర్పాటు చేయాలి.
- ఇన్పుట్ మార్కెటింగ్ వల్ల కేవలం 3% మాత్రమే లాభం వుంటే కూరగాయల మార్కెటింగ్ వల్ల ఎక్కువ లాభం వుంటుంది
- ఎఫ్.పి.ఓల వివరాలతో ఒక కరపత్రము తయారుచేసి బ్యాంక్‌లకు యివ్వాలి
- బ్యాంక్‌లు ఎఫ్.పి.ఓలకు వ్యాపార రుణాలు అవసరానికి తగినంతగా ఇవ్వాలి
- బ్యాంక్ ఉన్నతాధికారులు వారి క్రింది స్థాయి సిబ్బందిని ఎఫ్.పి.ఓ ల కార్యక్రమాలపై చైతన్యపరచాలి.
- ఎఫ్.పి.ఓలు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి డిజిటల్ లావాదేవీలు చేయాలి.
- నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి.
- ప్రతి ఎఫ్.పి.ఓ కూడా తమ సభ్యుల వాటాను నిర్వహిస్తూ ప్రతి సంవత్సరం ఎంతమంది సభ్యులు ఎఫ్.పి.ఓల ద్వారా లబ్ధి పొందుతున్నారో నమోదు చేయాలి.
- ప్రతి ఎఫ్.పి.ఓ కూడా తన సామర్థ్యాన్ని తెలుసుకోవాలి.
- ప్రతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ పాలకవర్గ సభ్యులు ఏపిమాస్ రూపొందించిన స్వయం అభ్యసన శిక్షణ కరదీపికను చదివి తమ అవగాహనను పెంపొందించుకోవాలి.

▸ "అమూల్" సంస్థ కేవలం రైతుల నుండి పాలను మాత్రమే సేకరించి దాదాపు 400 రకాల వివిధ ఉత్పత్తులను తయారు చేస్తూ ప్రపంచవ్యాప్తంగా అందరి మన్నలను పొందుతున్నది. ఆ దిశగా ఎఫ్.పి.ఓలు పయనించాలి.

▸ అమెజాన్ అనే సంస్థ తనకంటూ ఎటువంటి మౌలిక సదుపాయాలూ లేకుండానే కేవలం సాంకేతిక పరిజ్ఞానము ఉపయోగించి కోట్లలో వ్యాపారం చేస్తున్నది. మన ఎఫ్.పి.ఓలు ఎందుకు చేయకూడదో ఆలోచించాలి.

**హైదరాబాదు కార్యశాల**

**ఎఫ్**పీఓలకు బ్యాంకు ఋణాల సదుపాయంపై తెలంగాణా రాజధాని హైదరాబాదులో 01-08-2023న ఏపిమాస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్త నిర్వహణలో రాష్ట్ర స్థాయి కార్యశాల జరిగింది.

ఈ కార్యశాల ముఖ్య ఉద్దేశం తెలంగాణ రాష్ట్రంలోని ఏపిమాస్, ఇతర వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ఋణ సదుపాయం(బ్యాంక్ లింకేజి) కల్పించడం. ఇందుకోసం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా



వారితో ఏపిమాస్ సంప్రదించి వారి సహకారం తీసుకొని హైదరాబాదులో రాష్ట్ర స్థాయి కార్యశాలను నిర్వహించి వివిధ ఉత్పత్తిదారుల సంస్థలకు రుణాలు మంజూరు హామీ యిప్పించింది.

ఈ కార్యశాలలో తెలంగాణా రాష్ట్రంలో వివిధ సంస్థలు ఏర్పాటుచేసిన 43 రైతు ఉత్పత్తిదారుల సంస్థల వారు పాల్గొనగా 41 రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ఋణ మంజూరు హామీ పత్రాలను అందజేశారు.

తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి కార్యశాలను నిర్వహించి ఈ విధంగా రుణాల హామీ యిప్పించడం చాలా గొప్ప విషయమని పాల్గొన్నవారు అందరూ ఏపిమాస్‌ను, స్టేట్ బ్యాంక్‌ను ప్రశంసిస్తూ, ధన్యవాదాలు తెలిపారు.




ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం, రీజినల్ కార్యాలయం అధికారులు, ఏపిమాస్ నుండి సి ఇ ఓ శ్రీ సి.యస్ రెడ్డి, సిబ్బంది, వివిధ జిల్లాలలోని రైతు ఉత్పత్తిదారుల సంస్థల ప్రతినిధులు,ఉత్పత్తిదారుల సంస్థల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

**పాట్నా కార్యశాల**

బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో 20-08-2023 న ఏపిమాస్ , స్టేట్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కార్యశాల జరిగింది.

ఈ కార్యశాలలో బీహార్ రాష్ట్రంలోని వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన దాదాపు 50 ఉత్పత్తిదారుల సంస్థల వారు బ్యాంక్ లింకేజి కోసం దరఖాస్తు చేసుకొన్నారు.

ఇందులో 50 ఉత్పత్తిదారుల సంస్థల వారు పాల్గొనగా 30 రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ఋణ మంజూరు పత్రాలను ఇవ్వటం జరిగింది.

ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం, రీజినల్ కార్యాలయం అధికారులు, ఏపిమాస్ నుండి శ్రీ సి.యస్ రెడ్డి ఏపిమాస్ స్థానిక సిబ్బంది, బి.ఆర్.యల్.పి.యస్ రాష్ట్ర స్థాయి అధికారులు, వివిధ జిల్లాలలో ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేసిన సంస్థ ప్రతినిధులు, ఉత్పత్తిదారుల సంస్థల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ■

ఓడించడం కాదు, మనసులను గెలుచుకో ;హేళనగా నవ్వడం కాదు అందరితో ఆనందంగా నవ్వుకో

# అమరచింత రూరల్ మార్ట్ ప్రారంభోత్సవం!



**అ**మరచింత మండలంలో అమరచింత వ్యవసాయేతర ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ (ఆఫ్ ఫామ్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ … ఓ ఎఫ్ పి ఓ) కు మంజూరుచేసిన 'రూరల్ మార్ట్ 'ను నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం ఛీఫ్ జనరల్ మేనేజర్ శ్రీమతి సుశీల చింతల 2023 ఆగస్టు 21 వ తేదీన ప్రారంభోత్సవంచేశారు. ఈ రూరల్ మార్ట్ నాబార్డ్ సమకూర్చిన 6.35 లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో ఏర్పాటుచేశారు. అమరచింత మండలం, దాని పరిసర గ్రామాలలోని సిల్క్ చీరల నేత పనివారు తమ ఉత్పత్తులను స్థానికంగా విక్రయించుకోవడానికి ఈ రూరల్ మార్ట్ ఉపయోగపడుతుంది.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలోనే ఈ రూరల్ మార్ట్ ఆన్‌లైన్ పోర్టల్ www.amarachintahandloom.com ను ఆవిష్కరించారు.

నాబార్డ్ ప్రోత్సాహంతో ఏర్పాటైన ఈ ఓ ఎఫ్ పి ఓ లో ప్రస్తుతం 420 మంది సభ్యులు వున్నారు. చేనేత పనివారికి కొత్త డిజైన్ల గురించి అవగాహన కల్పించి, వారి నైపుణ్యాలను పెంపొందించడం, ముడి పదార్థాల సరఫరా, సిల్క్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్ మార్కెటింగ్ మొదలైన సహకారాన్ని ఈ రూరల్ మార్ట్ అందిస్తుంది. ఇంతేకాకుండా, ఎం ఎస్ ఎం ఇ శాఖ తోడ్పాటుతో ఈ ఓ ఎఫ్ పి ఓ 45 మగ్గాలతో ఉమ్మడి సదుపాయాల కేంద్రాన్ని (కామన్ ఫెసిలిటి సెంటర్), నేతపనివారికి నైపుణ్యాభివృద్ధికోసం ఒక శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నది.

ఛీఫ్ జనరల్ మేనేజర్ శ్రీమతి సుశీల చింతల ఈ ఓ ఎఫ్ పి ఓ నిర్వహిస్తున్న కామన్ ఫెసిలిటి సెంటర్‌ను కూడా సందర్శించారు. ఆమె చేనేత కార్మికులతో మాట్లాడుతూ, వినియోగదారుల అవసరాలకు తగిన ఉత్పత్తులను, యువత ఇష్టపడే ఉత్పత్తులను రూపొందించాలని సూచించారు. పట్టణ, గ్రామీణ వినియోగదారులను ఆకట్టుకునే సరికొత్త డిజైన్లను, ఉత్పత్తులను తీసుకురావాలని ఆమె సలహా యిచ్చారు.

తమ ఉత్పత్తుల విక్రయాలు పెరిగి, చేనేత కార్మికులకు గరిష్ఠ ప్రయోజనంచేకూరే విధంగా, మార్కెట్ అవసరాలకు అనుగుణమైన డిజైన్లను రూపొందిస్తామని ఓ ఎఫ్ పి ఓ ప్రతినిధులు పేర్కొన్నారు. ■

కేవలం శరీర బలమో, మనో బలమో కాదు , నీ సత్తాను చాటేది నిరంతర కృషి






ఎవరి జీవితమూ పరిపూర్ణం కాదు , కాని ప్రతి క్షణాన్ని మంచిగా జీవించగలిగితే అది సంపూర్ణమే

# గ్రామీణ స్థితిగతులపై మహిళా విశ్వవిద్యాలయంలో శిక్షణ

– డా.ఎస్.ప్రహల్లాద , డా.పి.తవిట తులసి

విశ్వవిద్యాలయ స్థాయిలో తరగతి గదిలోనే గ్రామీణ పరిస్థితులపై అవగాహన పెంపొందించుటకు అవకాశం ఏర్పడిందని ఏపిమాస్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ ఎస్. ప్రహల్లాద, అన్నారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ సంఘ సంక్షేమ విభాగం (సోషల్ వర్క్) విద్యార్థినులకు గ్రామీణ సహభాగ అధ్యయనం (పి.ఆర్.ఏ.)పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని 2023 ఆగస్ట్ 19, 20 తేదీలలో నిర్వహించడం జరిగింది. మొదటి రోజు




విద్యార్థినులకు ''గ్రామీణ సహభాగ అధ్యయన'' ప్రాముఖ్యతను, వివిధ రకాల అధ్యయన పద్ధతులపై అవగాహన కల్పించగా, రెండవ రోజు తిరుపతి గ్రామీణ మండలం తుమ్మలగుంట హరిజనవాడ గ్రామానికి తీసుకువెళ్ళి , తరగతి గదిలో నేర్చుకున్న పద్ధతులను ప్రయోగించి , అక్కడి 70 కుటుంబాల ప్రజల స్థితిగతులను అంచనా వేయడం జరిగింది.

ప్రముఖ శాస్త్రవేత్త రాబర్ట్ ఛాంబర్స్ ప్రవేశపెట్టిన వివిధ రకాల గ్రామీణ అధ్యయన పద్ధతులలో క్రింద తెలిపిన కొన్ని పద్ధతులను ప్రయోగించడం ద్వారా ప్రజల జీవన విధానాన్ని అవగాహన చేసుకునే ప్రయత్నం చేశాం.

**ట్రాన్సాక్ట్వాక్స్ :** ఈ పద్ధతిలో విద్యార్థినులు హరిజనవాడ లోని వీధులను అన్నింటిని తిరిగి, ఇంటి దగ్గర అందుబాటు లోని వారితో మాట్లాడి వారి స్థితిగతులను తెలుసుకున్నారు.

**సామాజిక చిత్ర పటం :** ఈ పద్ధతి ద్వారా అందరి సమక్షంలో గ్రామీణుల ఆర్థిక, సామాజిక స్థితిగతుల అధ్యయనం జరిగినది. గ్రామంలోని ప్రజలకు అందుబాటులో వున్న మౌలిక వసతులు అనగా ఇంటి స్థితి, మంచినీటి సదుపాయము, రోడ్లు, విద్యుచ్ఛక్తి మొదలగు వాటిని గురించి తెలుసుకున్నారు.

**చపాతి చిత్రపటం :** ఈ పటం ద్వారా ప్రజలకు అందుబాటులోని వివిధ రకాల ప్రభుత్వ , ప్రభుత్వేతర సంస్థలు, వాటి సేవలు, ఆ సేవల నాణ్యతను తెలుసుకోవడం జరిగింది. అనగా విద్యా సంస్థలు, ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు వాటి ద్వారా పొందే సేవల నాణ్యత, వాటి భౌతిక దూరం మొదలగు వాటి గురించి కూలంకుషంగా చర్చ జరిగింది.

**గ్రామచరిత్ర , మార్పుల పరిశీలన :** తుమ్మల గుంట హరిజనవాడ ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు ఆ గ్రామంలో వచ్చిన మార్పులను క్షుణ్ణంగా తెలుసుకున్నారు.

ఇవే కాకుండా యింకా వనరుల లభ్యత, జీవనోపాధుల విశ్లేషణ, అవసరాల అంచనా, ప్రాధాన్యత క్రమం మొదలగు వాటిని గురించి కూడా చర్చ జరిగింది.

**గ్రామీణ సహభాగ అధ్యయనం :** ఒకవైపు ప్రభుత్వ అధికారులకు, మరోవైపు గ్రామీణ ప్రాంతాలలో పని చేసే వివిధ స్వచ్ఛంద సంస్థల సిబ్బందికి పలు రకాల ప్రభుత్వ




సమస్యలు నీ సంతోషాన్ని దూరం చేసే లోగా నీవే సమస్యలను దూరం చేసుకోగలగాలి



సేవలను అర్హులైన పేదలకు , రైతులకు అందించుటకు గ్రామీణ సహభాగ అధ్యయనం (పి.ఆర్.ఏ) ఎంతగానో ఉపయోగపడుతుంది. అందువలన వివిధ రకాల సేవలకు లబ్ధిదారుల ఎంపికలోను , వారికి నాణ్యమైన సేవలను అందించడంలోను గ్రామీణ సహభాగ అధ్యయనం చాలా కీలకమైన భూమిక పోషిస్తున్నది.

**విద్యార్థినుల ప్రతిస్పందన:** ఈ రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో తాము చాలా చురుకుగా పాల్గొని అనేక విషయాలు నేర్చుకున్నామని, భవిష్యత్‌లో ఈ శిక్షణ చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రస్తుతము కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభివృద్ధికి వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేస్తున్నాయని, వాటిని విజయవంతంగా నిర్వహించడానికి ఈ పి.ఆర్.ఏ చాలా ఉపయోగపడు తుందని వారు అభిప్రాయపడ్డారు.

ఈ రెండు రోజుల కార్యక్రమంలో తమ విద్యార్థులు అనేక మంచి విషయాలు నేర్చుకున్నారని, ఈ కార్యక్రమానికి సహకరించిన ఏపిమాస్ సంస్థకు , సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ సి.ఎస్.రెడ్డి కి సంఘ సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ పి. తవిట తులసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ ఆచార్యులు డాక్టర్. వి. ఉమ, డాక్టర్.లలితకుమారి, సహాయ ఆచార్యులు డాక్టర్. మల్లీశ్వరమ్మ, డాక్టర్. వజీహ భానుతో పాటు 20 మంది విద్యార్థినులు పాల్గొన్నారు,

విశ్వవిద్యాలయ స్థాయిలోనే విద్యార్థినులకు గ్రామీణ సహభాగ అధ్యయనంపై శిక్షణ ఇచ్చి , చదువుతో పాటు వారికి గ్రామాలపై అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ సంఘ సంక్షేమ విభాగ (ఎం.ఎస్.డబ్ల్యు) విద్యార్థినులకు ఏపిమాస్ సంస్థ కొన్ని సంవత్సరాలుగా శిక్షణ ఇస్తున్నది. ఇంతే కాకుండా భారతదేశంలో ప్రసిద్ధిచెందిన గుజరాత్ లోని "ఇర్మా", ముంబైలోని "టిస్", తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల మొదలగు విద్యాలయాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ను అందిస్తున్నది. ■



## డాక్టర్ భారతికి 2 ఎకరాల స్థలం, లెక్చరర్ పదవి

**కూ**లీ పనులు చేసుకుంటూ పీహెచ్‌డీ చేసిన డాక్టర్ సాకే భారతికి రెండు ఎకరాల స్థలం కేటాయించడంతో పాటు జూనియర్ లెక్చరర్ పోస్ట్ మంజూరుచేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డాక్టర్ సాకే భారతికి అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి భూమి పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కూలీ పనులు చేసుకుంటూ శ్రీకృష్ణ దేవరాయల (ఎస్కే) యూనివర్సిటీలో సాకే భారతి పీహెచ్‌డీ పూర్తిచేయడం జిల్లాకే గర్వకారణమన్నారు. సంకల్పం ఉంటే మన విజయాన్ని ఏది ఆపలేదనడానికి సాకే భారతి నిదర్శనమని కలెక్టర్ గౌతమి అన్నారు. జీవితంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా ఆమె యువతకు రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు ఎకరాల భూమిని కేటాయించామని, అసంపూర్తిగా ఉన్న ఆమె ఇంటి నిర్మాణం పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ■

# ఏపిమాస్ 22వ వార్షిక మహాసభ

–జి. శ్రీనివాస్



ఏపిమాస్ 22వ వార్షిక మహాసభ 2023 ఆగస్టు 14వ తేదీన హైదరాబాదులోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ వార్షిక మహాసభలో ఏపిమాస్ బోర్డు సభ్యులు, మహాసభ సభ్యులు పాల్గొన్నారు. తెలంగాణా రాష్ట్రం నుండి రెండు జిల్లా సమాఖ్యల ప్రతినిధులు, ఒక రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్ పర్సన్, స్త్రీనిధి ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి మూడు జిల్లా సమాఖ్యల ప్రతినిధులు , తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో ఏర్పాటు చేసిన ఫెడరేషన్ ఛైర్‌పర్సన్స్ పాల్గొన్నారు.

మహాసభ సాయంత్రం నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ జిల్లాల నుండి వచ్చిన జిల్లా సమాఖ్యల ప్రతినిధులతో, రైతు సంస్థల ప్రతినిధులతో ఒక సమాఏశాన్ని ఏర్పాటు చేసి, ఆయా జిల్లాలలో జరుగుతున్న కార్యక్రమాల గురించి చర్చించారు. సంస్థల అభివృద్ధి కోసం ఏపిమాస్ ఇంకా ఎలాంటి పనులు చేస్తే బాగుంటుందని చర్చించి, వారు తెలియజేసిన విషయాలను ఏపిమాస్ బోర్డు సమావేశంలో, వార్షిక మహాసభలో ప్రదర్శించారు.

చర్చించిన విషయాలను ముఖ్యంగా రెండుగా విభజించారు. మొదటిది జిల్లా స్వయం సహాయ సమాఖ్యలు ప్రస్తుతం ఏ విధంగా పని చేస్తున్నాయో, రాబోయే రోజులలో జిల్లా సమాఖ్యలు, ఏపిమాస్ కలిసి ఎలాంటి కార్యక్రమాలు చేస్తే బాగుంటుందనేది.

రెండవది ప్రస్తుతం రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పి ఓలు) ఏ విధంగా పని చేస్తున్నాయో, రాబోయే రోజులలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు , ఏపిమాస్ కలిసి ఎలాంటి కార్యక్రమాలు చేస్తే బాగుంటుంది అనేది. ఈ రెండు అంశాలను చర్చించి ఛార్టు తయారుచేశారు. వాటిని మహాసభలో ప్రదర్శించారు.

**జిల్లా సమాఖ్యలతో కలిసి చేయాల్సినవి**

- పాలకవర్గ సభ్యులకు, సిబ్బందికి శిక్షణలు.
- రిసోర్స్ పర్సన్‌లను తయారుచేసి ఎస్‌హెచ్‌జి, విఓ, యంయస్, ఎస్ఎల్ఎఫ్, టిఎల్ఎఫ్,జడ్ఎస్‌లకు శిక్షణలు యిచ్చి అంతర్గత ఆడిట్, గ్రేడింగ్ నిర్వహించడం,
- ఎస్‌హెచ్‌జిలు తయారుచేసినఉత్పత్తులకు మార్కెటింగ్

జీవితమనే నాణానికి ఒకవైపు ఆనందం మరోవైపు అవేదన; ఒక్కటేకాదు రెండూ వుంటాయని మరచిపోకు

- స్త్రీనిధి బ్యాంకు లింకేజి అప్పులపై వడ్డీ శాతం తగ్గించాలని, వడ్డీ లేని ఋణం ఇవ్వాలని ఉద్యమాలు
- సక్రమంగా నడవని సంఘాల పునరుద్ధరణ
- లైంగిక, సామాజిక అంశాలపై పని చేయడం
- సమాఖ్యలలో సబ్ కమిటిలను ఏర్పాటుచేసి, వాటికి శిక్షణ యిచ్చి, వారికి పని కల్పించడం
- సంఘాలు,సమాఖ్యల స్థాయిలో ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటు
- సంఘాలు, సమాఖ్యల రేటింగ్ , సంస్థల అధ్యయనం
- సంఘాలు, సమాఖ్యలలో సక్రమంగా పుస్తక నిర్వహణ
- రైతుసంఘాలలో ఎక్కువమంది మహిళలు చేరేలా ప్రోత్సాహం
- సంఘాలలో పొదుపులు,స్వంత నిధులను పెంచుకోవడం
- సంఘసభ్యులకు బ్యాంకులోన్‌పై ఇన్సూరెన్స్ కల్పించడం

**రైతు సంస్థల కోసం ఏపిమాస్ చేయాల్సినవి**

- ఎఫ్‌పిఓ బోర్డు సభ్యులకు, సిబ్బందికి శిక్షణలు ఇవ్వాలి.
- ఎఫ్‌పిఓలకు బ్యాకు లింకేజి , ఋణ సదుపాయం
- బయ్యర్, సెల్లర్ సమావేశాల ఏర్పాటు
- ఇన్పుట్, అవుట్‌పుట్ మార్కెటింగ్
- ఎఫ్‌పిఓలలో పుస్తక నిర్వహణ, ఆడిట్ సరిగా జరిగేలా చూడటం
- రైతులు పండించిన పంట నిల్వకు గోదాము సౌకర్యం
- ఎఫ్‌పిఓలలో బిజినెస్ ప్లాన్ చేయించటం
- ఎఫ్‌పిఓలకు అన్ని రకాల లైసెన్సులు అందేలా చూడడం
- రైతులకు వ్యవసాయ పరికరాలు, పనిముట్లు అద్దెకు యిచ్చే సదుపాయం ఉండేలా చూడటం
- ఆర్గానిక్ వ్యవసాయానికి ప్రాధాన్యత
- పండించిన పంట ప్రాసెసింగ్, బ్రాండ్ నేమ్‌తో విక్రయం
- ప్రభుత్వ పథకాలతో అనుసంధానం
- ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై అవగాహన కల్పించటం
- ఎఫ్‌పిఓ స్థాయిలో వ్యాపార అవసరాల కోసం ఫెడరేషన్ ద్వారా హోల్‌సేల్ వ్యాపారం
- ఎఫ్‌పిఓ ద్వారా విత్తన ఉత్పత్తి కార్యక్రమాలు
- ఫుడ్ ప్రాసెసింగ్, పంటకు విలువ జోడించటం

మహాసభలో వార్షిక నివేదికను ఆమోదించారు. లెక్కల ఆడిట్ నివేదిక చదివి ఆమోదం తీసుకున్నారు. రాబోవు సంవత్సరంలో చేయబోవు పనులు, బడ్జెట్ వివరాలు చదివి ఆమోదం తీసుకొని మహాసభకు హాజరైన వారందరికి ధన్యవాదాలు తెల్పారు. ఏపిమాస్ చైర్మెన్ శ్రీ కాకి మాధవరావు అధ్యతన జరిగిన ఈ వార్షిక మహాసభలో ఫౌండర్ సి.ఇ.ఓ శ్రీ సి.యస్ రెడ్డి , ఏపిమాస్ బోర్డు సభ్యులు, మహాసభ సభ్యులు పాల్గొన్నారు ■

## దూడకోసం డీఎన్ఏ పరీక్ష వరకు....

ఎత్తుకెళ్లిపోయిన తన దూడను తిరిగి పొందేందుకు ఓ 70 ఏళ్ల రైతు మహా యజ్ఞమే చేశాడు! రాజస్థాన్ చురూలోని రామనగర్‌బాస్ ప్రాంతానికి చెందిన దులారాకు చెందిన ఓ దూడను 2021 ఫిబ్రవరిలో ఓ వ్యక్తి ఎత్తుకెళ్లిపోయాడు. అదే ఏడాది డిసెంబరులో అతను సర్దార్ శహర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు పట్టించుకోకపోవడంతో స్థానిక ఎస్పీని ఆశ్రయించగా ఆయన చొరవతో కొన్ని రోజులకు కేసు నమోదైంది. అయితే, విచారణ పూర్తి కాకముందే కేసు మూసేసినట్లు గుర్తించాడు. 2022 నవంబరులో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ తమ ప్రాంతానికి వస్తున్నారని తెలుసుకున్నాడు. ఉన్నతాధికారుల దృష్టి పడేందుకు అక్కడే ఓ టవర్ ఎక్కాడు. డీఎన్ఏ పరీక్ష నిర్వహించి, న్యాయం చేస్తామని వారంతా హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు కిందికి దిగాడు. ఈ ఏడాది జనవరిలో దులారామ్ ఇంట్లోని ఆవుతోపాటు ఎత్తుకెళ్లిన దూడ డీఎన్ఏ నమూనాలు సేకరించారు. హైదరాబాద్లోని ల్యాబ్లో వాటిని పరీక్షించేందుకు పంపారు. ఇటీవలే డీఎన్ఏ రిపోర్టు రాగా.. అందులో రెండు నమూనాలు మ్యాచ్ అయ్యాయి. దీంతో ఆ రైతు ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. పోలీసులు ఆ దూడను రైతుకు అప్పగించారు. ■

అర్థంకాకపోవడంతో, అయోమయంతో ఆగిపోకు ; ప్రయత్నించే వారికి అవి ప్రగతి చిహ్నాలే

# ఎఫ్ పి ఓల వార్షిక మహాసభల సంరంభం !

ఏపిమాస్ నిర్వహణలోని ఎఫ్ పి ఓలు, ఎఫ్ ఓ సి లు తమ చట్టబద్ధ కార్యకలాపాలలో భాగంగా,ఆగస్టు నెలలో వార్షిక మహాసభలను ముమ్మరంగా నిర్వహించాయి. దాదాపు డజనుకు పైగా ఎఫ్ పి ఓలు, ఎఫ్ ఓ సి లు తమ వార్షిక మాహాసభలను నిర్వహించుకుని, కొత్త కార్యవర్గాలను ఎన్నుకుని, నూతన సంవత్సరానికి భవిష్యత్ ప్రణాళికలను రూపొందించుకున్నాయి. వాటిలో కొన్ని సంస్థల మహాసభల వివరాలను చూద్దాం.

**రామసముద్రం రైతు సమాఖ్య**

రామసముద్రం మండల కేంద్రంలో రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఈఓ అంబిక మాట్లాడుతూ. 22-23 ఆర్థిక సంవత్సరంలో సమాఖ్య మొత్తం నిర్ణయించిన 12 నెలలవారీ 12 సమావేశాలు నిర్వహించామని, సగటున 80% సభ్యులు హాజరైనారని తెలిపారు. రామసముద్రం మండల ఎరువులు, ఎఫ్ డి సి సంబంధిత సమాచారం, అమ్మకాల ధరలు, వాట్సప్ గ్రూపుల ద్వారా సమాచారం అందించామని, పశువులకు దాణా రైతు మిత్రలు టీఆర్ఎస్ వారు చెప్పిన ఇండెంట్ వారీగా తెప్పించి అందజేశామని ఆమె తెలిపారు.

మండలంలో 14 గ్రామ రైతు సంఘాలు ఏర్పాటయ్యాయి. ఈ సంఘాలలో 2,163 మంది రైతులు సభ్యులుగా వున్నారు. బెంగళూరులోని బిగ్ బాస్కెట్, మెట్రో చెన్నై కోయంబేడు మార్కెట్, గ్లోబల్ ఫార్మ్ ఫ్రెష్ లిమిటెడ్, మొదలగు కంపెనీలతో ఒప్పందం చేసుకొని సభ్య రైతులకు గిట్టుబాటు ధర కల్పించుటకు కూరగాయల మార్కెటింగ్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్టు వివరించారు.

ఈ కార్యక్రమంలో యింకా ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్ రెడ్డి, బీడీఓ మధుసూదన్‌రెడ్డి, ఎస్.పి.ఓ కో ఆర్డినేటర్ శ్రీనివాసులురెడ్డి, బి.ఓ.పి. ఎల్. యు రామకృష్ణారెడ్డి, చంగారెడ్డి, రంగప్ప, గంగప్ప, రైతుమిత్ర రాణెమ్మ, రెడ్డెప్ప, శ్రీకన్య, రెడ్డి వీరే గౌడ, రైతులు, అధికారులు, పాల్గొన్నారు.

**పీలేరు ఎఫ్ పి ఓ**

సంఘటిత వ్యవసాయాన్ని ప్రోత్సహించే క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు ఉత్పత్తిదారులు సంఘాలకు పెద్దఎత్తున సబ్సిడీలు అందిస్తున్నందున వాటికి ఉజ్వల భవిష్యత్ ఉందని జిల్లా సామాజిక అటవీ శాఖాధికారిణి నాగమునీశ్వరి తెలిపారు. పీలేరులో జరిగిన పీలేరు రైతు ఉత్పత్తిదారుల సంఘం 5వ వార్షికోత్సవంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. జిల్లా ఉద్యానశాఖాధికారి రవిచంద్రబాబు మాట్లాడుతూ ఉత్పత్తిదారులు సంఘాలకు పంట కలెక్షన్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్, ప్యాక్ హౌస్, చిల్లింగ్ సెంటర్, పాలీహౌస్, నర్మరీ, షేడ్‌నెట్, తదితర సదుపాయాలు సబ్సిడీపై అందిస్తున్నాయన్నారు.

**వ్యాపారంలో శ్రీ నల్లారెడ్డిస్వామి ఎఫ్‌పిసికి మొదటి స్థానం**


శ్రీ నల్లారెడ్డి స్వామి ఎఫ్‌పిసి రైతు అంగడి ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరము నందు 4.55 లక్షల వ్యాపారం చేసిందని, ఇది ఏపిమాస్ ఏర్పాటు చేసిన 84 ఎఫ్‌పిఓలలో అన్నింటిలో మొదటి స్థానంలో వున్నట్టు ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సివిఎస్ రెడ్డి ప్రకటించి, సంఘ సభ్యులకు, డైరెక్టర్స్‌కు, సిబ్బందికి అభినందనలు తెలియ చేశారు. 2023-24 సంవత్సరంలో గమనించవలసిన 5 ప్రధాన అంశాలను ఆయన ప్రస్తావించారు.

1. సంఘంలో వాటాదారుల సంఖ్య 1000 మందికి పెరగాలి
2. మొత్తం సభ్యులలో 50% మహిళలు ఉండాలి. అంటే ఇకపై అందరినీ మహిళలనే చేర్చుకోవాలి
3. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.10కోట్లు వ్యాపారం చేయాలి.
4. కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేసుకోవాలి.
5. దీర్ఘ కాలిక వ్యాపార ప్రణాళికను తయారుచేసుకొని దానికి అనుగుణంగా పని చేయాలి.

■

ప్రేమించ గలిగితే ద్వేషానికి తావెక్కడిది ? ప్రేమించే మనసులో ప్రేమకు తప్ప మరి దేనికీ చోటు వుండదు

# పెట్టుబడి లేకుండా లాభాలను అందిస్తున్న జనుము!



సాధారణంగా ఖరీఫ్ వరి పంటకు ముందు జనుము విత్తనాలు చల్లి ఏపుగా ఎదిగిన తర్వాత దానిని దమ్ములో దున్నుతారు. దీనివల్ల వరి పొలం సారవంతమై అధిక దిగుబడులు రావడానికి ఈ జనుము ఎంతో ఉపయోగపడుతుంది.

పత్తి, మిరప లాంటి పంటలకు వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి నష్టాలను చవిచూసి విసుగు చెందిన రైతులు.. పంటమార్పిడి వైపు దృష్టిసారించారు. తక్కువ ఖర్చుతో.. చీడపీడల బాధ లేకుండా లాభాలను తీసుకొచ్చే జనుము సాగు చేస్తున్నారు ఆదిలాబాద్ జిల్లా రైతులు. బైబ్యాక్ ఒప్పందం ప్రకారం తెలంగా సీడ్స్ కొనుగోలు చేస్తుండటంతో ఇటు మార్కెటింగ్ సమస్య కూడా లేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ ఖర్చుతో రైతులకు లాభాలను ఇచ్చే పంట జనుము. ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మండలం, పొచ్చెర గ్రామంలోని రైతులు జనుమును సాగు చేపట్టారు. సాధారణంగా ఖరీఫ్ వరి పంటకు ముందు జనుము విత్తనాలు చల్లి ఏపుగా ఎదిగిన తర్వాత దానిని దమ్ములో దున్నుతారు. దీని వల్ల వరి పొలం సారవంతమై అధిక దిగుబడులు రావడానికి ఈ జనుము ఎంతో ఉపయోగపడుతుంది.

అయితే విత్తన కొరతతో తెలంగాణ సీడ్స్ కార్పోరేషన్ రైతుల చేత బైబ్యాక్ ఒప్పందంపై జనుమును సాగు చేయిస్తున్నారు. ప్రస్తుతం జనము పూత, కాత దశలో ఉంది. ఎటువంటి పెట్టుబడి లేకుండా పురుగుల మందు బాధ పెద్దగా లేకుండా ఈ పంట పండుతుంది.

సేద్యంలో రైతు పూర్తిగా రసాయనిక ఎరువుల పైనే ఆధారపడటం వల్ల సాగులో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. సేంద్రీయ ఎరువులు వాడక పోవటం వల్ల భూసారం తగ్గి , దిగుబడులు గణనీయంగా పడిపోతున్నాయి. తోంది. ఈ సమస్యలను అధిగమించడానికి ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట పైర్లను ప్రోత్సహిస్తోంది తెలంగాణ ప్రభుత్వం. అయితే విత్తనాల కోసం రైతులకు పౌండేషన్ సీడ్ అందించి.. బైబ్యాక్ ఒప్పందంపై సాగు చేయిస్తున్నారు. ■

## సోలిపేటలో మహిళా రైతులకు శిక్షణ

సేంద్రియ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని డాక్టర్ హరగోపాల్ అన్నారు. సోలిపేటలోని గ్రామీణ మహిళా మండలి. ఆధ్వర్యంలో మహిళా రైతు సంఘాల సభ్యులకు కూరగాయల సాగుపై మెళకువలు, మార్కెటింగ్, ప్యాకింగ్, బ్రాండింగ్ వంటి అంశాలపై శిక్షణ శిబిరం నిర్వహించారు. తక్కువ వడ్డీతో బ్యాంక్ రుణాలు పొంది వ్యాపారం విస్తరించుకోవాలని సూచించారు.

**కోరుకున్నట్టు జీవితం నడవకపోవచ్చు , కాని జీవించే అనుక్షణం ఉదాత్తంగా నడవగలిగితే చాలు**

# ఏపిమాస్ ఎఫ్ పి ఓల వార్షిక మహాసభల దృశ్యమాలిక



గుడిపాల ఎఫ్ పి సి



శ్రీ నల్లారెడ్డి స్వామి ఎఫ్ పి సి – హెచ్ కైరవాడి




కురబలకోట మహిళా ఎఫ్ పి ఓ




ఎం టమాట ఎఫ్ పి సి




మర్యాద రామన్న పట్నం ఎఫ్ పి సి




నల్లమాడ ఎఫ్ పి ఓ



నిమ్మనపల్లి ఎఫ్ పి సి



రెడ్డెమ్మ ఎఫ్ పి సి

**స్నేహం పేరుతో ఎన్నో ఆశించే వారు ఎందరో,కేవలం స్నేహాన్నే ఆశించే కొందరే నీ నిజమైన స్నేహితులు**

# ఏపిమాస్ ఎఫ్ పి ఓల వార్షిక మహాసభల దృశ్యమాలిక



తాడిపత్రి ఎఫ్ పి ఓ ...



తవణంపల్లి ఎఫ్ పి సి



శ్రీ భ్రమరాంబిక మహిళా ఎఫ్ పి సి – నందికొట్కూరు ...





సుగుటూరు గంగమ్మ ఎఫ్ పి ఓ



పీలేరు ఎఫ్ పి సి



వి కోట ఎఫ్ పి ఓ





వాల్మీకిపురం ఎఫ్ పి ఓ ....



నందీశ్వర ఎఫ్ పి సి

అయినదానికి కానిదానికి అతిశయం చూపడం కాదు, అణకువగా మెలగడం ఆనందానికి మూలం

# పారిశ్రామిక మహిళలకు భారీ రుణాలు !

**సొం**తంగా వ్యాపార వేత్తలుగా , పారిశ్రామికవేత్తలుగా రాణించాలని కలలుగంటున్న మహిళలకు , ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. వారికి రూ. 10 లక్షల నుంచి రూ. 1 కోటి వరకు రుణాలు అందిస్తోంది. తక్కువ వడ్డీ రేటుతోనే ఈ రుణాలు పొందవచ్చు. 18 నెలల పాటు కట్టాల్సిన పని లేదు కూడా. ఈ కేంద్ర ప్రభుత్వ స్కీమ్ గురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం.

ఇది అద్భుతమైన అవకాశం. కేంద్రం ప్రభుత్వం రూ. 10 లక్షల నుంచి రూ. 1 కోటి వరకు రుణం అందించేలా 'స్టాండ్ అప్ ఇండియా' పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో లోన్ తీసుకుంటే 18 నెలల పాటు కట్టాల్సిన పని లేదు. ఈ పథకం ద్వారా మహిళలే కాదు, ఎస్సీ, ఎస్టీల్లో మహిళలతో పాటు పురుషులు సైతం ఈ రుణం పొందేందుకు అర్హులేనని గుర్తుంచుకోవాలి.

కేంద్ర ప్రభుత్వం ఈ స్కీమ్‌ను 2015 ఆగస్టు 15 న ప్రారంభించింది. సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలు నెలకొల్పి పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి బ్యాంకుల ద్వారా రూ. 10 లక్షల నుంచి కోటి రూపాయల వరకు రుణం అందజేస్తోంది కేంద్రం. ఇప్పటివరకు ఈ పథకం కింద 2 లక్షల 11 వేల 925 మంది లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో 1 లక్ష 91 వేల 52 మందికి రుణాలు సైతం మంజూరు చేశారు. ఆ మొత్తం విలువ రూ. 43,046 కోట్లుగా ఉంటుందని స్టాండ్ అప్ ఇండియా అధికారిక వెబ్‌సైట్లో పేర్కొంది.

**3 లక్షల వరకు రుణం అందించే 'ఉద్యోగిని'**

**మ**హిళలు రూ.3 లక్షల వరకు రుణంపొంది,88 రకాల చిన్నచిన్న వ్యాపారాలు నెలకొల్పుకొని ఆర్థికంగా స్థిరపడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకమే 'ఉద్యోగిని'.

ఉద్యోగిని పథకం అంటే ఏమిటి, దీని కింద రుణం ఎలా పొందాలి, పాటించాల్సిన నియమ నిబంధనలు ఏమిటి, దరఖాస్తు ఎలా చేయాలి, ఏఏ వ్యాపారాలు చేయడానికి రుణం ఇస్తారు?

కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ కార్యక్రమం లక్ష్యాల్లో మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఆర్థిక సహాయం అందించడమూ ఒకటి.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారవేత్తలుగా ఎదిగి తమ కాళ్లపై తాము నిలదొక్కుకోవడానికి ప్రవేశపెట్టిన పథకమే ఉద్యోగిని.



దీన్ని మొదట కర్ణాటక ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పటికీ తరువాత కేంద్ర ప్రభుత్వం దీన్ని వుమెన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పర్యవేక్షణలో దేశమంతటా అమలు చేస్తోంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 48 వేల మంది మహిళలు లబ్ధి పొంది చిన్నపాటి పారిశ్రామికవేత్తలుగా రాణిస్తున్నారు.

**రుణ పరిమితి రూ. 3 లక్షలేనా?**

కాదు. వైకల్యమున్న మహిళలు, వితంతువులకు రుణ పరిమితి లేదు. వారు నెలకొల్పే వ్యాపారం, వారి అర్హతలను బట్టి ఇంకా ఎక్కువ రుణం కల్పిస్తారు.

**వడ్డీ ఎంత ?**

వైకల్యం ఉన్నవారు, వితంతువులు, దళిత మహిళలకు పూర్తిగా వడ్డీ లేని రుణం కల్పిస్తారు. మిగిలిన వర్గాలకు చెందిన మహిళలకు 10 శాతం నుంచీ 12 శాతం వడ్డీ

మీద రుణం ఇస్తారు. ఈ వడ్డీ అనేది ఆ మహిళ రుణం పొందే బ్యాంకు నిబంధనలను బట్టి ఉంటుంది.

**రుణంలో రాయితీ ఎంత?**

కుటుంబ వార్షికాధ్దాయాన్ని బట్టి 30 శాతం వరకూ రాయితీ కల్పిస్తారు.

**ఎవరు అర్హులు?**

18 సంవత్సరాలు నిండిన 55 సంవత్సరాల వయసులోపు మహిళలందరూ అర్హులే. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళలు తమ క్రెడిట్ స్కోరు బలంగా ఉండేలా చూసుకోవాలి. గతంలో ఏదైనా రుణాలు తీసుకుని సరిగ్గా తిరిగి చెల్లించకుండా ఉన్నట్లయితే రుణం ఇవ్వరు. సిబిల్ స్కోరు బాగా ఉండేటట్లు చూసుకోవాలి.

**ఏమేం పత్రాలు సమర్పించాలి?**

- పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు జత చేయాలి.
- దరఖాస్తు చేస్తున్న మహిళ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు రేషన్ కార్డు కాపీని జతపరచాలి.
- ఆదాయ ధ్రువీకరణ పత్రం
- నివాస ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం
- బ్యాంకు ఖాతా పాసు పుస్తకం

**ఎవర్ని సంప్రదించాలి?**

ఈ పథకం కింద రుణం పొందడానికి మహిళలు తమ ప్రాంతంలోని బ్యాంకులను సంప్రదించాలి.

బజాజ్ ఫైనాన్స్ లాంటి ప్రైవేటు ఆర్థిక సంస్థలు కూడా ఈ రుణాన్ని కల్పిస్తున్నాయి.

**మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన చిరునామా:**

ఉద్యోగిని, డి-17, బేస్‌మెంట్ - సాకేత్,
న్యూఢిల్లీ - 110017,
ఫోన్ నంబర్ : 011-45781125,
ఈమెయిల్ : mail@udyogini.org

**(బి బి సి డాట్ కామ్ / తెలుగు సౌజన్యంతో)**

■

## ఒక్కసారి నాటితే నాలుగేళ్లు పండే వరి!



చైనాలోని యున్నాన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు 'పీఆర్-23' పేరుతో కొత్త రకం వరి వంగడాన్ని అభివృద్ధి చేశారు. ఈ వరిని ఒక్కసారి నాటితే వరుసగా నాలుగేళ్లు ... అంటే ఎనిమిది పంటలు పండడం విశేషం! ఇప్పటికే చైనాలో ఈ వరి పంటను సాగు చేస్తున్నారు .

అక్కడ రెగ్యులర్‌గా వాడే ఒర్యా సతివా రకం వరిని, ఆఫ్రికాకు చెందిన మరో రకం వరిని సంకరం చేసి 'పీఆర్-23'ని రూపొందించారు. ఈ వరిని ఒక్కసారి నాటితే చాలు.. నాలుగేళ్లు, ఎనిమిదిసార్లు వరి కోతకు వస్తుంది. పైగా సాధారణ వరితో పోలిస్తే దిగుబడి కూడా ఎక్కువే ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. హెక్టార్‌కు సగటున 6.8 టన్నుల వరి పండుతుంది. అంతేకాదు ఈ పంటకు అయ్యే ఖర్చు కూడా చాలా తక్కువ. ఎందుకంటే ఒక్కసారి నాటువేస్తే.. మరో ఏడు పంటల వరకు నాట్లు వేయాల్సిన ఖర్చు తగ్గుతుంది. కూలీల సమస్య ఉండదు. ప్రతిసారీ విత్తనాలు కొనాల్సిన అవసరం లేదు. అలాగే రసాయనాలు కూడా పెద్దగా వాడాల్సిన అవసరం ఉండదు.

సాధారణ వరితో పోలిస్తే ఈ వరి పంట వల్ల కనీసం 58 శాతం ఖర్చులు తగ్గుతున్నట్లు అంచనా ఇది కాలం గడిచేకొద్దీ భూమిలో గట్టిగా పాతుకుపోతుంది. వేళ్లు ఇంకా లోపలికి చొచ్చుకుపోతాయి. దీంతో దిగుబడి మరింత పెరుగుతుంది. దీంతో ఈ పంట రైతులకు ఎంతగానో మేలు చేస్తుంది. అలాగే ఇది. పర్యావరణానికి కూడా మేలు కలిగిస్తుంది. కర్బన ఉద్గారాలు తగ్గిస్తుంది. ■

# క్యాన్సర్ ముప్పును తగ్గించే ఎర్రబియ్యం !

**రెడ్** రైస్.. గురించి వినను కూడా విని ఉండరు చాలామంది. ఈ బియ్యం పొడవుగా ఉంటాయి. ఆంథోసైనిన్ అనే వర్ణద్రవ్యం నుండి ఎర్రటి రంగును కలిగి ఉంటాయి. ఈ రెడ్ రైస్ పాలిష్ చేసిన బియ్యం కంటే కూడా అధిక పోషక విలువను కలిగి ఉంటాయి. రెడ్ రైస్‌ను సాధారణంగా ఆసియా దేశాలలో.. ముఖ్యంగా భారతదేశం, శ్రీలంక, ఇండోనేషియాలో పండిస్తూ ఉంటారు. బియ్యం దాని బయటి పొర నుంచి ఎరుపు రంగును పొందు తుంది. దీనికి ఊక అని పిలుస్తారు. మరి ఈ రెడ్ రైస్‌ను ఎందుకు తినాలి? దీని వల్ల ఉపయోగాలేంటి? అనేవి చూద్దాం.



**1. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి**

రెడ్ రైస్‌లో ఆంథోసైనిన్‌ల వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవే బియ్యం ఎరుపు రంగు రావడానికి కారణం. ఈ యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించడంలో సహాయపడతాయి. తద్వారా క్యాన్సర్, గుండె జబ్బులు, మధుమేహం వంటి వివిధ వ్యాధులకు దారితీసే కణాల నష్టాన్ని నిరోధించడం కానీ లేదంటే లేదా నెమ్మదిస్తుంది.

**2. ఫైబర్ పుష్కలం**

ఎర్ర బియ్యంలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కొవ్వు తక్కువగా ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి బాగా ఉపయోగపడుతుంది. జీర్ణక్రియ ప్రక్రియలో ఫైబర్ చాలా అవసరం. పేగు కదలికలను మెరుగుపరచడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి, శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు షుగర్ పెరగకుండా చేస్తాయి. ఇది టైప్ 2 డయాబెటిస్‌ను అభివృద్ధి చేసే ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**3. విటమిన్లు, ఖనిజాలు పుష్కలం..**

రెడ్ రైస్‌లో పుష్కలంగా విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ముఖ్యంగా విటమిన్ బి6 కావల్సినంత లభిస్తుంది. ఇది శరీరానికి మానసిక స్థితిని నియంత్రించే రెడ్ బ్లడ్ సెల్స్, న్యూరో ట్రాన్స్‌మిటర్‌లను ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. రెడ్ రైస్‌లో ఉండే విటమిన్ ఇ, ఆరోగ్యకరమైన చర్మాన్ని నిర్వహించడానికి సహాయ పడే యాంటీ ఆక్సిడెంట్, కొన్ని క్యాన్సర్‌ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అదనంగా, ఎర్ర బియ్యంలో పొటాషియం, ఐరన్, మెగ్నీషియం ఉన్నాయి. ఇవి రక్తపోటు, జీవక్రియను నిర్వహించడానికి సహాయపడతాయి.

**4. గ్లూటెన్ ఫ్రీ..**

రెడ్ రైస్ సహజంగా గ్లూటెన్ రహితంగా ఉంటుంది. ఉదరకుహర వ్యాధి, గ్లూటెన్ అసహనం లేదా వీట్ అలెర్జీ ఉన్నవారికి ఇది అద్భుతమైన ఆప్షన్. గ్లూటెన్ తినడం వల్ల ఈ పరిస్థితులు ఉన్నవారికి తీవ్రమైన కడుపు నొప్పి, అతిసారం, ఇతర జీర్ణ సమస్యలు వస్తాయి. అందువల్ల ఎర్ర బియ్యాన్ని వారి ఆహారంలో చేర్చడం వల్ల గోధుమ, రైస్, బార్లీ వంటి గ్లూటెన్ అధికంగా ఉండే ధాన్యాలకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా మారుతుంది.

**5. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది..**

రెడ్ రైస్ పెద్దప్రేగు క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్‌ల ప్రమాదాన్ని తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. బియ్యంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ సమ్మేళనాలు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ■

ప్రశాంతత మనసులో వుండాలి , చుట్టూ వుండడం కాదు

# 40 ఏళ్లు దాటిన మహిళలు ... ఆరోగ్యసమస్యలు

సామాన్యంగా 40 ఏళ్లు దాటిన మహిళల శరీరంలో పలు మార్పులు వస్తుంటాయి పొత్తికడుపులో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం, వెయిట్ పెరగడం, డయాబెటిస్ బారిన పడటం జరుగుతుంది. ప్రీ మోనోపాజ్ దశలో మూడ్ స్వింగులు, హార్ట్ ఫ్లాషేస్ వంటి సింటమ్స్ కనిపిస్తుంటాయి. చాలావరకు ఈస్ట్రోజన్ లెవెల్స్ తగ్గడం వల్ల ఇన్సులిన్‌తో పాటు బ్లడ్ చేయవలసిన కంట్రోల్ చేసే హార్మోన్స్ కూడా తగ్గుతుంది. ఇటువంటి సమస్యలను ఎదుర్కోవాలంటే హెల్తీ లైఫ్ స్టైల్ ను అలవర్చుకోవాలని శరీరానికి అవసరమైన విటమిన్లు ఇతర పోషకాలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

మహిళలు మాతృత్వ దశలో పిల్లలకు పాలు ఇస్తుంటారు శరీరంలోని ఎముకల్లో క్యాల్షియం సమృద్ధిగా ఉన్నప్పుడే తగినంత పాలు ప్రొడ్యూస్ అవుతాయి. అలాగే నడుములు వంగిపోకుండా మోకాళ్ళ నొప్పులు ఇబ్బంది పెట్టకుండా ఉండేందుకు కూడా కాల్షియం అవసరం కాబట్టి తీసుకునే ఆహారంలో కాల్షియం సరిగా ఉండేలా తీసుకోవాలని అది లోపిస్తే ఆస్టియో పూర్వసిస్ అనే ఎముకల వ్యాధి వస్తుందని అంటున్నారు వైద్య నిపుణులు.

క్యాల్షియం పుష్కలంగా ఉండే పాలు ఆకుకూరలు ఇతర ఆహారాలు తీసుకోవాలి. వీటితోపాటు క్యాల్షియన్ని గ్రహించగలిగే విటమిన్ డి శరీరానికి చాలా ముఖ్యం. ఇది క్యాల్షియం శరీరంలో ఎక్కడపడితే అక్కడ పేరుకుపోకుండా సహాయపడుతుంది. ఇది సూర్యరశ్మి ద్వారా లభిస్తుంది. ప్రతిరోజు ఉదయం పూట ఎండలో కాసేపు నిలబడితే మంచిది. అలాగే ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్స్ ఐరన్ పుష్కలంగా లభించే ఆహారాలు తీసుకోవాలని సూచిస్తున్నారు వైద్యులు.

అలాగే 40 ఏళ్లు పైబడిన మహిళలకు విటమిన్ బి కాంప్లెక్స్ చాలా అవసరం. ఎందుకంటే ఇందులో అంతర్భాగా మైన పోలిక్ యాసిడ్ శరీరంలోని హార్మోన్ల సమతుల్యతకు సహాయపడుతుంది. దీనివల్ల రోగాల వారిని పడకుండా ఉంటాయి. ఎముకలు పెళుసు బారక్కుండా ఉండాలంటే విటమిన్ బి తయామిన్ రిబోఫ్లోవింగ్ కూడా ముఖ్యం అంటున్నారు నిపుణులు.

మహిళల్లో విటమిన్లు, ప్రోటీన్లు లోపిస్తే కొలెస్ట్రాల్ పెరుగుతుంది. బాడీమాస్ ఇండెక్స్ మెయింటెనెన్స్ అవకాశం ఎక్కువగానే ఉంటుంది. అంతేకాకుండా కండరాలు పట్టుత్వం కోల్పోయి, ఎక్కువ రోజులు ప్రొటీన్ల లోపం కొనసాగడం, దీర్ఘకాలం జీవించే అవకాశాన్ని తగ్గిస్తుంది. అందుకే తగినంత పాలు, కోడిగుడ్లు, పప్పు దినుసుల్లో ఎక్కువ ప్రోటీన్లు లభిస్తాయి. డైటీషియన్ల సూచనల మేరకు ప్రోటీన్ల లోపాన్ని నివరించే సప్లిమెంట్స్ వాడాలని అంటున్నారు స్త్రీల వైద్య నిపుణులు. ■

## డబ్బా పాలు వద్దు ... తల్లి పాలే ముద్దు

మహిళా అభివృద్ధి సొసైటీ శిశుసంక్షేమ శాఖ సహకారంతో కార్వాన్‌లోని అర్బన్ న్యూట్రీషన్ ప్రాజెక్ట్ ఏరియా ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సీనియర్ పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ సంతోష్ హాజరయ్యారు. 'డబ్బా పాలు వద్దు–తల్లిపాలు ముద్దు', 'తల్లిపాలు ఔషధం–డబ్బాపాలు నిషేధం' అనే విషయాలపై గర్భిణులకు అవగాహన కల్పించారు. వందమంది గర్భిణి, పాలిచ్చే తల్లులకు డాక్టర్లు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, లలిత కుమారి, రేణుక, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. ■



# ట్రైనీ ఐ ఏ ఎస్ లకు పాఠాలు చెబుతున్న స్వయంసహాయ మహిళ !

**చి**న్న మొత్తాలతో మహిళలు సాధిస్తున్న విజయాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దేశంలోని స్వయం సహాయక సంఘాల్లో 9 కోట్ల మంది మహిళలున్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా పొదుపు సంఘాల్లో ఈ ఏడాది చివరకు మరో కోటి మందిని చేర్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. మరి పొదుపు సంఘాల పనితీరు గురించి, వాటిలో మహిళలు సాధిస్తున్న విజయాల గురించి అద్భుతంగా చెబితేనే కదా కొత్తవారు ఆకర్షితులయ్యేది. అందుకే అయిదు రాష్ట్రాల్లో సంఘాల గురించి అద్భుతంగా చెప్పే మహిళలకు గూగుల్ మీట్ ద్వారా పోటీలు నిర్వహించారు.

అందులో మన తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన ఒకే ఒక్కరు 'ఉప్పునూతుల శోభారాణి'. ఆమె సంఘాల గురించి చెప్పిన తీరుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి గిరిరాజ్ సింగ్ ఆశ్చర్యపోయారు. 'మీ పేరు చిన్నదే కానీ చేసే పని గొప్పది' అంటూ ఆయన ప్రసంగంలోనే శోభను కొనియాడారు. గతంలోనూ ట్రైనీ ఐఏఎస్‌లకు పొదుపు పాఠాలు చెప్పారామె. అయితే ఆ పాఠాలన్నీ.... తన అనుభవంలోంచే రావడం విశేషం.

**బాల్య వివాహంతో....**

ఎనిమిదో తరగతిలోనే చదువు మాన్పించి... 14 ఏళ్లకే పెళ్లి చేశారు అమ్మానాన్నలు. మహబూబాబాద్ జిల్లాలోని బొల్లెపల్లి గ్రామం ఆమె అత్తారిల్లు. భర్త వెంకన్న సైకిల్ దుకాణం నడిపేవారు. కటిక పేదరికంలో కనీసం తినడానికి తిండి కూడా లేని పరిస్థితులు. అయినా శోభ చదువుపై ఇష్టం వదులుకోలేదు. ఇంటి, వంట పని చేసి పదో తరగతి చదివేందుకు స్థానిక ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేవారు. ఇక చదివినట్టే అంటూ తోటి విద్యార్థులు గేలి చేసినా శోభ కుంగిపోలేదు. కష్టపడి చదివి పదో తరగతి మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. బతుకుదెరువు కోసం వరంగల్ జిల్లా గీసుకొండ మండలం జాన్‌పాకకు వచ్చారు. అప్పుడప్పుడే స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) బలోపేతం అవుతున్నాయి. శోభ సభ్యురాలుగా చేరి చిన్న మొత్తాల్లో పొదుపు చేయడం మొదలు పెట్టారు. హిందీ నేర్చుకొని రిసోర్స్ పర్సన్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. తన వాక్చాతుర్యానికి సానపెట్టుకుని 20 రాష్ట్రాల్లో వేల మంది మహిళలకు పొదుపు పాఠాలు నేర్పారు.

శోభ మాట్లాడే తీరు చూసి అప్పటి 'సెర్ప్' అధికారులు ముస్సోరిలో శిక్షణ ఐఏఎస్‌లకు పొదుపు సంఘాల గురించి చెప్పే అవకాశాన్ని సైతం ఇచ్చారు. శోభ హిందీలో వివరించిన తీరు చూసి అనేక మంది ట్రైనీ ఐఏఎస్‌లు ప్రత్యేకంగా అభినందించారు. మరోపక్క కాకతీయ విశ్వవిద్యాలయంలో బీఏ పూర్తి చేశారు. తాను పనిచేస్తున్నది గ్రామీణాభివృద్ధి సంస్థలో కాబట్టి రెండేళ్ల క్రితం ఎం.ఎ. రూరల్ డెవలప్‌మెంట్లో పీజీ పూర్తి చేశారు. తన ఇద్దరబ్బాయిలను బీటెక్ చదివిస్తున్నారు.

'సంధ్య అని.. తనకు తెలుగు తప్ప హిందీ రాదు. తనకి నెమ్మదిగా హిందీ నేర్పించా. ఇప్పుడు ఆమె సంఘంలో ఉత్సాహంగా పని చేయడమే కాదు.. పుస్తకాలు, లెక్కలు చూడ్డం కూడా నేర్చుకొంది. బీటెక్ చదువుతోంది. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్ లాంటి రాష్ట్రాల్లో పొదుపు గురించిన అవగాహన చాలా తక్కువ. శిక్షణ ఇద్దామని వెళ్తే ఆడవాళ్లు బయటకు కూడా వచ్చేవారు కాదు. మగవాళ్లు దురుసుగా ఉండేవారు. ఓపిక పట్టి కథలు చెబుతూ, ఆటపాటలతో వాళ్లని ఆకట్టుకుని ఆడవాళ్లకి పాఠాలు చెప్పేదాన్ని.

మొదట్లో నన్ను రావద్దని వారించిన మగవాళ్లే తర్వాత 'సారీ దీదీ' అని చెప్పిన సందర్భాలు కోకొల్లలు. నేను శిక్షణ ఇచ్చిన వాళ్లలో ఎంతోమంది ప్రధాన మంత్రిని కలిసి ఆయన ప్రశంసలు పొందేవారు. అలాంటి వారంతా తిరిగి కాల్ చేసి 'మీ వల్లే మాలో ఈ ఆత్మవిశ్వాసం'.. అంటే జీవితంలో ఇంతకన్నా సంతృప్తి ఉంటుందా?' అనుకొనేదాన్ని' అంటారు శోభ. ■

చిత్తశుద్ధి అంటే ఎవ్వరూ నిన్ను గమనించకపోయినా సరైన రీతిలో ప్రవర్తించడమే

# కాసులు కురిపిస్తున్న కంచె పంట !



పొలం కంచెకు ఉపయోగపడుతుందని తీసుకొచ్చిన ఒక వాక్కాయ మొక్క 80 ఎకరాలకు విస్తరించి నేడు రైతులకు కాసులు కురిపిస్తోంది. బాపట్ల జిల్లా మండలకేంద్రం కొరిశపాడుకు చెందిన కడివేటి జగన్నాథరెడ్డి ఏళ్ల కిందట కాశీకి వెళ్లినప్పుడు అక్కడినుంచి కొన్ని మొక్కలు తీసుకువచ్చారు. వాటిలో వాక్కాయ మొక్క ఒకటి. ఈ చెట్టుకు ముళ్లు ఎక్కువగా ఉంటాయి. దీన్ని పొలం గట్టుపై వేస్తే కంచెగా ఉంటుందని భావించారు. జగన్నాథరెడ్డి సోదరుడు విశ్వనాథరెడ్డి తన పొలంలో గట్టుపై నాటారు. పెరిగాక దాని కాయలను విత్తనాలుగా మార్చి ఎకరం పొలంలో విశ్వనాథరెడ్డి సాగు చేశారు. లాభాలు రావడంతో ప్రస్తుతం 13 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

ఎకరానికి 200 మొక్కలు నాటవచ్చు. తొలి ఏడాది దిగుబడి తక్కువగా ఉన్నా చెట్టు పెరిగే కొద్దీ దిగుబడి పెరిగిందని రైతు తెలిపారు. రెండేళ్ల తరువాత ఒక చెట్టుకు 25 నుంచి 30 కిలోల వాక్కాయలు వచ్చాయి. ఎకరానికి సుమారు 5 నుంచి 6 టన్నుల దిగుబడి వస్తోంది.

ప్రస్తుతం మార్కెట్ ధర కిలో రూ.50 ఉంది, అడవి జాతి మొక్క కావడంతో పెట్టుబడి ఖర్చు తక్కువ, ఏడాదికి రెండు మూడుసార్లు నీరందిస్తే సరిపోతుంది. పూత సమయంలో పురుగు సోకకుండా మందులు పిచికారీ చేస్తే దిగుబడి పెరిగే అవకాశముంది. బేకరీల్లో ఉండే చెర్రీ పండ్లను వీటితోనే తయారుచేస్తారు. విజయవాడ, కోల్ కతా నుంచి వ్యాపారులు తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు.



కొరిశపాడుకు చెందిన మహిళా రైతు ఎం.సునందన తమ పొలంలో పండిన వాక్కాయలతో పచ్చళ్లు తయారు చేస్తున్నారు. చింతపండుకు వీటిని ప్రత్యామ్నాయంగా వాడవచ్చని తెలిపారు. “కంచె కోసం ఈ మొక్కను తీసుకువచ్చాం. అనంతరం ఎకరంలో సాగు చేశాం. లాభాలు రావడంతో 12 ఎకరాల్లో వేశాం. తోటి రైతులు మొక్కలు అడిగారు. గతంలో మేమే నాణ్యమైన మొక్కలు అందించేవాళ్లం. ప్రస్తుతం మొక్కల తయారీని ఆపివేశాం. గుంటూరు, ప్రకాశం జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులకు విత్తనాల కోసం ఉచితంగా వాక్కాయలను ఏటా అందిస్తాం. చెట్టు నుంచి కాయలు కోసేందుకు యంత్రాన్ని తయారుచేయాలని గతంలో శాస్త్రవేత్తలను కోరాం. ఆ యంత్రం వస్తే కూలీ ఖర్చు తగ్గి లాభాలు వస్తాయి”.

(ఈనాడు సౌజన్యంతో)

■

# మన నేలలో సిరులు పండిస్తున్న అరుదైన అవకాడో !

తెలంగాణ రాష్ట్రం కందుకూరు మండలం దెబ్బగూడకు చెందిన జైపాల్ నాయక్ తమ పొలంలో అవకాడో పంటను సాగు చేస్తున్నాడు. అవకాడో 38 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలో పెరిగే ఉష్ణ మండలం పండు. తెలంగాణలో ఇదే మొదటి అవకాడో పంట. ఇంతేకాక బంగ్లాదేశ్ నుంచి భారత దేశానికి దిగుమతి చేసుకున్న మొదటి ఆస్ట్రేలియన్ అవొకాడో రకం కూడా కావడం విశేషం.



జైపాల్ నాయక్ లండన్లో ఎంబీఏ పూర్తి చేశాడు. ఆ తర్వాత కరోనా సమయంలో ఇండియాకు వచ్చేశాడు. ఇంటి దగ్గరే ఉంటూ తమ పొలంలో అవకాడో సాగుచేయాలని ఆలోచించాడు. అనుకున్నట్లుగానే మొక్కలు ఎక్కడ దొరుకుతున్నదీ తెలుసుకున్నాడు. నర్సరీలు ఉన్న పండ్ల రైతును కలిశాడు. తాను అవకాడో అనే పంట పండించాలనుకుంటున్నాని అతడికి చెప్పాడు.

అందుకోసం మొక్కలు అడగ్గా.... కృష్ణారెడ్డి వాటిని ఇచ్చేందుకు అంగీకరించాడు. అయితే తాను ఆస్ట్రేలియాకి చెందిన అవకాడో రకాన్ని బంగ్లాదేశ్ నుంచి దిగుమతి చేసుకున్నట్లు చెప్పాడు. ఇలా దాదాపు 200 వరకు మొక్కలు కొనుగోలు చేసిన జైపాల్ నాయక్.... తన పొలంలో ఈ మొక్కలను సాగు చేశాడు.



కొంతమంది రైతులు ఒకటి, రెండు మొక్కలు మాత్రమే తీసుకున్నారని కృష్ణారెడ్డి అన్నారు. కానీ జైపాల్ నాయక్ మాత్రం ధైర్యంతో చాలా మొక్కలు తీసుకున్నాడని అన్నారు. దాదాపు 200 వరకు మొక్కలు నాటిన జైపాల్ మూడేళ్లలోనే తన మొదటి పంటను అందుకున్నాడు. ఆయనకు వచ్చే లాభాలను చూసి మరికొంతమంది రైతులు కృష్ణారెడ్డిని సంప్రదిస్తున్నారు. అయితే చివరికి జైపాల్ రెడ్డి కన్న కల నెరవేరింది. నెల క్రితమే పంట చేతికి వచ్చింది. దాదాపు 600 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. అయితే ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ఆ పండు రుచి చూసేందుకు తరలివచ్చారు. ఆ పండ్లను కొనుగోలు చేశారు. కేవలం మూడు రోజుల్లో పంట మొత్తం అమ్ముడు పోయింది. దీంతో జైపాల్ నాయక్‌కు 4 లక్షల రూపాయల వరకు లాభం వచ్చింది.

మెక్సికో, మధ్య అమెరికా దేశాల్లో పండే ఈ అవకాడో మొక్కలను ఒక్కసారి నాటితే దాదాపు 30 ఏళ్ల పాటు ప్రతి సంవత్సరం రెండు పంటలు పండుతాయని చెప్పారు. అలాగే ఇప్పుడు చేతికి రానున్న పంటను కూడా కువైట్‌కు ఎగుమతి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు చెప్పాడు. మరో విషయం ఏంటంటే....

తెలుగు మీడియంలో చదువుకున్న నాయక్.. ఇంగ్లీష్ రాకపోయినా లండన్ వెళ్లి ఎంబీఏలో చేరారు. ఆ తర్వాత సొంత ఊరికి వచ్చి చాలా ఉద్యోగాలు చేశారు. ఒకరి కింద పని చేయడం ఇష్టం లేక సొంతంగా ఏదైనా చేయాలనుకున్నాడు. ఈ క్రమంలోనే అవకాడో సాగు చేయాలని ఆలోచన వచ్చినట్లు పేర్కొన్నాడు. పంట సాగు కోసం ఒక లక్ష 40 వేల రూపాయల ఖర్చు వచ్చిందని చెప్పాడు. అయితే ఇప్పటివరకు నాలుగు లక్షల వరకు లాభం వచ్చినట్లు చెప్పాడు.

(టీవీ9 సౌజన్యంతో)

■

గెలుపే ఆనందానికి మూలం కాదు , అయితే ఆనందం గెలిచే బలం యిస్తుంది

# కరెంట్‌తో పనిలేకుండానే పొలానికి నీళ్లు!



కొందరికి అమితమైన తెలివితేటలు ఉన్నా.. సరైన ప్రోత్సాహం లేక మరుగున పడిపోతుంటారు. మరికొందరు తమ ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు అవసరమైన ఆర్థిక స్తోమత లేక మిన్నకుండిపోతుంటారు. అయితే ఇంకొందరు మాత్రం ఉన్న వనరులను, వస్తువులను సద్వినియోగం చేసుకుని.. చివరకు అద్భుతాలను సృష్టిస్తుంటారు. ఇలాంటి వినూత్న ప్రయోగాలకు సంబంధించిన వీడియోలు నెట్టింట తెగ వైరల్ అవుతుంటాయి.

తాజాగా, ఈ తరహా ప్రయోగానికి సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. ఓ యువకుడు కరెంట్ అవసరం లేకుండానే పొలానికి నీళ్లు వదులుతున్నాడు. ఇతడి తెలివితేటలు చూసి నెటిజన్లు షాక్ అవుతున్నారు.

సోషల్ మీడియాలో ఓ వీడియో తెగ వైరల్ అవుతోంది. ఓ వ్యక్తి తన పొలానికి నీళ్లు పట్టేందుకు విద్యుత్ అవసరం లేకుండా నడిచే మోటార్ను తయారు చేశాడు. ఇందుకోసం బోరు మోటారు ఎదురుగా ఓ స్టాండ్‌పై మోటారుతో పాటూ ఓ చక్రాన్ని కూడా అమర్చాడు. ముందు చేత్తో కొద్ది సేపు చక్రాన్ని తిప్పడం వల్ల పైపు నుంచి నీళ్లు బయటికి వచ్చాయి. వేగంగా వచ్చిన నీరంతా.. ఎదురుగా ఉన్న చక్రంపై పడ్డాయి. దీంతో చక్రం అత్యంత వేగంగా తిరగడం వల్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది.

దీంతో అటు మోటారు తిరగడంతో పాటూ ఇటు పొలానికి నీళ్లు కూడా వెళ్తున్నాయి. పక్కనే ఓ బోర్డు ఏర్పాటు చేసి, దానిపై బల్బులను ఏర్పాటు చేశాడు. ఆన్ చేయగా ఆశ్చర్యకరంగా అన్నీ వెలుగుతూ ఉంటాయి. ఇలా ఫ్రీగా విద్యుత్ ఉత్పత్తి చేయడమే కాకుండా పొలానికి నీళ్లు కూడా పడుతున్నాడు.

ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు వివిధ రకాలుగా స్పందిస్తున్నారు. “ఇలాంటి వారిని ప్రోత్సహించాలి”.. అంటూ కొందరు, “ఈ రైతు తెలివితేటలు అద్భుతం”.. అంటూ ఇంకొందరు, “రైతులకు ఇది బాగా ఉపయోగపడుతుంది”.. అని మరికొందరు కామెంట్లు చేస్తున్నారు.

– ఎబిఎన్ సౌజన్యంతో

■

**నీవు చేయవలసింది నీ సవాళ్లను పరిమితం చేసుకోవడం కాదు , నీ పరిమితులను సవాలు చేయడం**

# తెలంగాణాలో వరిసాగు ఉల్టా పల్టా!

ఏటికేడు పెరుగుతూ వస్తున్న వరి విస్తీర్ణానికి ఈసారి బ్రేక్ పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో నైరుతి రుతు పవనాలు బలహీనంగా ఉండటం, ఐదు వారాలు గడిచినా వర్షాలు సరిపడా కురియకపోవటంతో వరి సాగుపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఇప్పటివరకు 2 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడాల్సి ఉండగా 1.40 లక్షల ఎకరాల్లోనే వరినాట్లు పడ్డాయి. అయితే పోసిన నార్లకు నీళ్లు లేకపోవటం, బురద దుక్కులు సిద్ధం చేయటానికి నీటి వసతి లేకపోవటంతో రైతులు వరిసాగుకు వెనకడుగు వేస్తున్నారు. రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిన విషయం విదితమే! వానాకాలం, యాసంగి.. రెండు సీజన్లలో కలిపి కోటి ఎకరాలకు పైగా వరి సాగవుతోంది. ఇక వానాకాలం విషయానికి వస్తే, 2020-21 లో 53.34 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 2021-22 లో 61.95 లక్షల ఎకరాల్లో నాట్లు వేశారు. 2022-23 లో 64.55 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. ఈసారి కూడా 65 లక్షల ఎకరాలకు పైచిలుకు విస్తీర్ణంలో రైతులు వరి సాగుచేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది.



కానీ వాతావరణం అనుకూలించకపోవటం, వరుణుడు కరుణించకపోవటంతో అంతా ఉల్టాపల్టా అయింది. సాధారణంగా జూన్ మొదటి, రెండో వారాల్లో నార్లు పోసే రైతులు... ఈసారి నిర్ణీత షెడ్యూలు ప్రకారం వరినార్లు పోయలేకపోయారు. ఎంత నీటి వసతి ఉన్నప్పటికీ... వర్షాలు పడకపోతే ఆ నార్లు కూడా ఆరోగ్యంగా పెరిగే పరిస్థితి ఉండదు. ఇప్పుడు అలాంటి పరిస్థితులే నెల కొన్నాయి. పోసిన నార్లు కూడా ఎదగటంలేదు. నాట్లు వేసేందుకు రైతులు ఆసక్తి చూపటం లేదు. బోరుబావుల్లో సమృద్ధిగా నీళ్లు ఉన్న రైతులే వరి నాట్లు వేస్తున్నారు.

నిజామాబాద్‌లో 55 వేల ఎకరాలు, కామారెడ్డిలో 17 వేల ఎకరాలు, నారాయణపేటలో 35వేల ఎకరాలు, యాదాద్రి భువనగిరిలో 10 వేల ఎకరాలు, నల్లగొండలో 7 వేల ఎకరాలు, ఖమ్మంలో 5 వేల ఎకరాలు, రంగారెడ్డి జిల్లాలో 5 వేల ఎకరాలు, వికారాబాద్‌లో 7 వేల ఎకరాలు, కరీంనగర్‌లో 5 వేల ఎకరాలు, నాగర్‌కర్నూల్‌లో 7 వేలు, వనపర్తిలో 5 వేల ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేశారు. అంతా కలిపి కేవలం 1.40 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి నాట్లువేశారు. సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం తక్కువగానే ఉంది. 50 లక్షల ఎకరాల సాధారణ విస్తీర్ణంలో.... ఇప్పటి వరకు 2 లక్షల ఎకరాల్లో నాట్లు పడాల్సి ఉండగా.... 60 వేల ఎకరాలు తక్కువగా నాట్లు పడ్డాయి. దీంతో వరి సాగు చేయటానికి రైతులు వెనకాముందు ఆలోచిస్తున్నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**65 లక్షల ఎకరాలు దాటేనా?**

వరి సాగు విస్తీర్ణం వానాకాలంలో 65 లక్షల చేరువకు వచ్చేసింది. ఈసారి అంతకంటే ఎక్కువే సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. కానీ ఇప్పుడున్న వాతావరణ పరిస్థితుల ప్రకారం.... 50 లక్షల ఎకరాలు కూడా దాటుతుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం సీజన్ ముగియటంలో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వర్షాలు పడకపోతే సాగులెక్కలన్నీ తారుమారయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికిప్పుడు వర్షాలు పడినా... దీర్ఘకాలిక రకాలు సాగు చేయటం శ్రేయస్కరం కాదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. స్వల్పకాలిక రకాలతోపాటు వెదజల్లే పద్ధతి కూడా మేలు చేస్తుందని, పంట కాలవ్యవధి తగ్గుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒకవేళ కాలం కలిసిరాకపోతే వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని సూచిస్తున్నారు. ■

**తప్పుచేస్తానేమోననే సంకోచం సృజనశీలతకు చేటుచేస్తుంది, ధైర్యంగా ముందడుగే దానికి మందు**

# వృద్ధులకు ప్రతి నెలా రూ. 57 వేల పెన్షన్!

వృద్ధుల అవసరాలను తీర్చడానికి మోదీ ప్రభుత్వం ఒక కొత్త పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దేశంలోని సీనియర్ సిటిజన్లకు మద్దతుగా కొనసాగుతున్న ప్రయత్నాల్లో భాగంగా, ప్రభుత్వం ' నేషనల్ పెన్షన్ స్కీమ్ ' (ఎన్ పి ఎస్) ను తీసుకు వచ్చింది. ఇది ఆకర్షణీయమైన రాబడితో మంచి పెట్టుబడి ఎంపిక. 60 ఏళ్ళు పైబడిన వ్యక్తులు నిర్ణీత నెలవారీ పెన్షన్ పొందేందుకు అర్హులు.



పదవీ విరమణ అనంతరం తమ ఆర్థిక భవిష్యత్తును సురక్షితంగా ఉంచుకోవాలనుకునే వారికి ఇది అద్భుతమైన అవకాశం. ఎన్ పి ఎస్ లో చిన్న పెట్టుబడితో కూడా అధిక రాబడికి అవకాశం ఉంది.

ఉదాహరణకు, 25 ఏళ్ల వ్యక్తి రోజుకు కేవలం రూ. 50తో ఎన్ పి ఎస్ లో పెట్టుబడి పెట్టడం ప్రారంభించవచ్చు. వారికి 60 ఏళ్లు వచ్చేసరికి, పెట్టుబడి మొత్తం రూ.57,42,416 అవుతుంది. ఈ పథకం 10% ఆకర్షణీయమైన వార్షిక వడ్డీ రేటును అందిస్తుంది.

విశేషమేమిటంటే, ఎన్ పి ఎస్ 20–25 ఏళ్ల వయసు వారికి మాత్రమే పరిమితం కాదు. 75 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. పెట్టుబడిదారు మొత్తం 100% యాన్యుటీని కొనుగోలు చేయాలని ఎంచుకుంటే, వారికి నెలవారీ రూ. 28,712 పెన్షన్ లభిస్తుంది. యాన్యుటీలో 40% మాత్రమే కొనుగోలు చేస్తే వారు రూ. 11,485 నెలవారీ పెన్షన్తో పాటు రూ.34 లక్షల మొత్తాన్ని పొందవచ్చు.

ఎన్ పిఎస్ ఆర్థిక భద్రత, స్థిరత్వం అందిస్తుంది. పెట్టుబడి కాలం తర్వాత మొత్తం కార్పస్ సుమారు 68 లక్షలు. ■

---

## ఈ పోస్టాఫీస్ పథకంలో బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ కంటే అధిక రాబడి !

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్ బీఐ) గతేడాది మే నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు మొత్తం మీద రెపో రేటును 2.5 శాతం వరకు పెంచింది. అంతర్జాతీయ అనిశ్చితులకు తోడు పెరిగిపోతున్న ద్రవ్యోల్బణానికి కట్టడిగా ఈ చర్య తీసుకుంది. దీంతో బ్యాంకులు తాము ఇచ్చే రుణాలపై రేట్లను పెంచాయి. అదే సమయంలో డిపాజిట్లపై వడ్డీ రేట్లను మాత్రం కొంత తక్కువ సవరించాయి. దీంతో ఇప్పుడు ఐదేళ్ల టర్మ్ డిపాజిట్ పై అన్ని ప్రభుత్వ బ్యాంకుల్లో ఇంటరెస్ట్ రేట్ అన్నది 5.75 శాతం నుంచి గరిష్టంగా 6.7 శాతం.

ఎక్కువ శాతం ప్రైవేటు రంగ బ్యాంకుల్లోనూ ఇది 6.2 శాతం నుంచి 7.25 శాతం మధ్యే ఉంది. ప్రైవేటు బ్యాంకుల్లో ఒక్క డీసీబీ బ్యాంక్ ఐదేళ్ల టర్మ్ డిపాజిట్ పై 7.75 శాతం రేటును ఆఫర్ చేస్తోంది. బ్యాంక్ డిపాజిట్లతో పోల్చుకుంటే ఐదేళ్ల పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్ లో రేటు మెరుగ్గా ఉంది. 7.5 శాతం రేటు ప్రస్తుతం అమల్లో ఉంది.

పైగా ఇందులో వడ్డీని ప్రతి మూడు నెలలకు ఒకసారి కాంపౌండ్ (అసలుకు కలుపుతుంటారు) చేస్తారు. చెల్లించడం మాత్రం వార్షికంగా చేస్తుంటారు. పోస్టాఫీసు డిపాజిట్లకు కేంద్ర ప్రభుత్వం హామీగా ఉంటుందని మర్చిపోవద్దు. అందుకే ప్రస్తుతం బ్యాంక్ డిపాజిట్ల కంటే పోస్టాఫీస్ ఐదేళ్ల టైమ్ డిపాజిట్‌లో రాబడి మెరుగ్గా ఉన్నట్టు కనిపిస్తోంది. పోస్టాఫీసు టైమ్ డిపాజిట్‌లో కనీసం రూ.1,000 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. గరిష్ట పెట్టుబడి పరిమితి లేదు. ■

**పుట్టిన రోజు గొప్పదే , కాని ఎందుకు పుట్టామో తెలుసుకోగలిగితే ఆరోజు అంతకంటె గొప్పది**

# కోర్టు తీర్పుల్లో లైంగిక వివక్ష పదజాలంపై నిషేధం

**మార్గదర్శకాల హ్యాండ్‌బుక్ పై నల్సార్ యూనివర్సిటి ప్రొఫెసర్, తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి విశ్లేషణ**

**లిం**గ వివక్షను ప్రతిబింబించే పదాలను కోర్టు తీర్పుల్లో ప్రయోగించద్దు అని సుప్రీంకోర్టు ఆదేశించింది. మహిళల విషయంలో మూస పద్ధతిలో పదాల వాడకానికి స్వస్తి పలకాలంటూ 'హ్యాండ్ బుక్ ఆన్ కంబాటింగ్ జెండర్ స్టీరియో టైప్స్' పేరుతో మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ నేపథ్యంలో మూస పదాల వాడకానికి స్వస్తి పలుకుతూ వెలువడిన ఈ హ్యాండ్ బుక్ మీద నల్సార్ లా యూనివర్సిటీ ప్రొఫెసర్ నిముషకవి వాసంతి తన అభిప్రాయాన్ని ఇలా వ్యక్తం చేస్తున్నారు.

కోర్టుల్లో విచారణ, తీర్పుల సమయంలో లైంగిక సమానత్వాన్ని ప్రతిబింబించే మాటలను ఉపయోగించేలా మార్గ నిర్దేశం చేస్తూ "హ్యాండ్ బుక్ ఆన్ కంబాటింగ్ జెండర్ స్టీరియో టైప్స్' కరదీపికను సుప్రీంకోర్టు విడుదల చేసింది. ఇది చాలా మంచి విషయం. అదే సమయంలో అనుచిత పదాలు వాడకూడదని కూడా సూచించింది.



దీన్ని న్యాయపరిపాలనతో పాటు మిగతా సామాజిక రంగంలోని వారంతా కూడా స్వాగతిస్తున్నారు. మంచి మార్పునకు ఇదొక తొలి అడుగు. ఒక్కోసారి కొన్ని పదాలను మూస పద్ధతిలో అలవోకగా వాడేస్తుంటాం. అదీ పతిత, వేశ్య లాంటి చాలా పదాలను కేవలం మహిళలను అడ్రస్ చేసేప్పుడు ప్రయోగిస్తుంటాం. అలాంటివి వాడకూడదు అని ఈ హ్యాండ్ బుక్ నొక్కిచెబుతుంది. వాటికి బదులుగా ఎలా ప్రస్తావించవచ్చు అని కూడా మార్గనిర్దేశం చేస్తుంది.

కనుక న్యాయమూర్తులకు ఇదొక అద్భుతమైన కరదీపిక అనడంలో అతిశయోక్తి లేదు, కెరీర్ ఉమెన్, చేస్ట్ ఉమెన్ (పవిత్రురాలు) లాంటి పదాలకు బదులు మహిళ (ఉమెన్) అనాలని హ్యాండ్ బుక్‌లో సూచించారు. డ్యూటీఫుల్ వైఫ్, ఒబీడియంట్ వైఫ్, ఫెయిత్ ఫుల్ వైఫ్ లాంటి పదాలకు బదులు 'వైఫ్' అని మాత్రమే ప్రస్తావించాలని కూడా చెప్పారు. ఇలా వివక్షతకు తావు యిచ్చే చాలా మాటలను నిరోధించారు. అయితే, హౌస్ వైఫ్‌కు బదులుగా హోమ్ మేకర్ అనచ్చు అన్నారు. హోమ్ మేకర్ అనేకంటే కూడా, ఉమెన్ అనచ్చు కదా.! ఇలా చాలా పదాలకు లింగ సమానత్వాన్ని కలిగిన సమాన అర్థాలు లేవు. అలాంటి వాటిని ఇంకా కొత్తగా రూపొందించుకోవాలి. 'మగ' మాటలు ఒడగట్టుకోవాలి. అందులోనూ మన మాతృభాషలో మరింత పదసంపదను సృష్టించుకోవాలి.

**ఫెమినిస్ట్ జడ్జిమెంట్ ప్రాజెక్టు....**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ప్రత్యేక శ్రద్ధ, చొరవ వల్లే ఇలాంటి అరుదైన హ్యాండ్ బుక్ బయటకు వచ్చింది. అయితే, ఇలాంటి హ్యాండ్ బుక్ రూపకల్పన వెనుక మహిళా సంఘాల సుదీర్ఘ పోరాటం లేకపోలేదు. వాళ్లు ఎప్పటి నుంచో తీర్పుల్లోని కొన్ని పదాల పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ పదాలను వాడాలని అడుగుతున్నారు.

ఆరేళ్ల కిందట ఫెమినిస్ట్ జడ్జిమెంట్ ప్రాజెక్టు' పేరుతో పెద్ద సదస్సు ఒకటి ఢిల్లీలో జరిగింది. అందులో జస్టిస్ చంద్రచూడ్ కూడా పాల్గొన్నారు. ఆ సమయంలోనే మహిళల అంశాల మీద కొందరు పురుష న్యాయమూర్తులు వ్యాఖ్యానిస్తూ, వెల్లడించిన ముఖ్య క్లిష్టమైన తీర్పులను ఎంపిక చేసుకున్నాం. వాటిని స్త్రీవాద దృక్పథం నుంచి తిరగరాసే ప్రయత్నం చేశాం. అందులో 'ఇండిపెండెంట్ థాట్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' తీర్పులో... ఇండియన్ పీనల్ కోడ్ కింద మ్యారిటల్ రేప్ నేరం కాదు అంటూ వెలువడిన

భయంతో ఎక్కడికని పారిపోతావ్ ? ఆ భయం వున్నదే నీ గుండెలో ...

జడ్జిమెంట్ ఫెమినిస్ట్ పాయింట్ ఆఫ్ వ్యూ నుంచి... దాన్ని ఐపీసీ నుంచి మినహాయించకూడదు. మ్యారిటల్ రేప్‌నూ నేరంగా పరిగణించాలంటూ తీర్పు తిరగరాశాను. ఆ సదస్సుకు దేశం నలుమూలల నుంచి న్యాయనిపుణులు చాలామంది హాజరయ్యారు. వారందరి సమక్షంలో.. తీర్పుల్లో ఎలాంటి పదాలు వాడకూడదు అనే అంశంపైన, లింగ వివక్షకు తావులేకుండా జడ్జిమెంట్లు ఎలా రాయాలి అనే అంశంపైన పెద్దచర్చ సాగింది.

**చట్టాల్లోనూ మార్పు అవసరం....**

ఈ హ్యాండ్ బుక్లో జెండర్ ఈక్వాలిటీకి సంబంధించి చాలా పదాలను సూచించారు. పైగా గతంలో కొన్ని తీర్పుల్లో ఎలాంటి అనుచిత పదాలు వాడారో కూడా ఉదాహరించారు. ప్రొవొకేటింగ్ క్లాతింగ్ లాంటి వాటిని వాడద్దు అన్నారు. అన్‌వెడ్ మదర్, ఎఫైర్... అలాంటి వాటిని అనుచిత పదాలుగా ప్రస్తావించారు. ఫోర్స్‌బుల్ రేప్ అనే పదానికి బదులు రేప్ అని వాడాలి అన్నారు. దీన్ని అంతా స్వాగతిస్తారు.

అయితే, కొన్ని విషయాలకు సంబంధించి చట్టాల్లో మార్పు చేయకుండా కేవలం భాష రూపంలో మాత్రమే మార్చడం వల్ల ప్రయోజనం అంతంత మాత్రమే.! రేప్‌ను కేవలం లైంగికపరమైన విషయం వరకే పరిమితమై చూడకుండా, అందులోని హింసాత్మక పార్శ్వం గురించి కూడా మాట్లాడాలి. కానీ చాలా తీర్పుల్లో అది మనకు కనిపించదు. గృహహింస చట్టం కింద నమోదయ్యే కేసులను సీరియస్‌గా తీసుకోరు. భార్యను భర్త హింసిస్తే దాన్ని నేరంగా చూసే పరిస్థితి లేదు. ఇలాంటి విషయాల్లో మార్పు అవసరం.

**అమలు తీరు...**

హ్యాండ్ బుక్ లోని మార్గదర్శకాలను అమలు చేయడం చాలా సులువు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను మిగతా కోర్టుల్లోని న్యాయమూర్తులు కచ్చితంగా అమలు చేస్తారు కనుక, తీర్పు ఎలా వెలువరించినా, భాష విషయంలో మాత్రం వీలైనంత త్వరలో మార్పులను చూస్తాం. తద్వారా భావంలోనూ కొంత మార్పు వస్తుందేమో చూడాలి.! ఒకప్పటితో పోలిస్తే మహిళా న్యాయమూర్తుల సంఖ్య కూడా కాస్త పెరిగింది. కనుక జెండర్ సెన్సిటివిటీతోనే పదాలను వాడతారని, దీనిపట్ల మిక్కిలి అవగాహనతో ఉంటారని ఆశిస్తున్నాను.రాజకీయ నాయకులు సైతం అనుచిత వ్యాఖ్యలు చేస్తే చర్యలు తీసుకోవాలని కౌషల్ కిషోర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ యూపీ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కనుక రాజకీయ నాయకులు కూడా మహిళలకు సంబంధించిన కేసుల విషయంలో ఇష్టానుసారంగా మాట్లాడటం తగదు. ఒకవేళ వారు నోరుజారితే కేసు నమోదు చేయవచ్చు కూడా.

**చట్టాలతో మార్పు సాధ్యమా అంటే...**

కొన్ని అంశాలలో మార్పు చట్టాల వల్ల కలుగుతుందా లేదా సామాజిక చైతన్యం ద్వారా లభిస్తుందా... అనడిగితే చెప్పడం కష్టం. కొన్ని విషయాల్లో చట్టం చేసినా, సమాజంలో మార్పు రానప్పుడు వృథా అవుతుంది. ఉదాహరణకు వరకట్న నిషేధం చట్టం చేసినప్పటికి, సమాజంలో మార్పు లేదు కదా! పైగా కట్నం తీసుకోవడం తప్పు కాదు అనే అవగాహన తోనే ఎక్కువమంది ఉండటం చూస్తాం. సమాజంలో మార్పు లేదు కదా అని చట్టం చేయకుండా వదిలేయడం సరికాదు. కనుక మార్పు రావాలి అంటే, చట్టపరంగా, సామాజిక పరంగా రెండు వైపుల నుంచి ప్రయత్నాలు సాగాలి. అలాంటి ప్రయత్నంలో భాగమే ఈ కరదీపిక కూడా. దీన్ని ఒక్క న్యాయవ్యవస్థ మాత్రమే కాదు మీడియా తదితర రంగాలు కూడా అనుసరిస్తే మంచిది. తద్వారా జెండర్ స్టీరియోటైప్ పదాలకు ప్రత్యామ్నాయ పదాలు వాడుకలోకి వస్తాయి.

**పదాల వెనుక భావాన్ని అర్థం చేసుకోవాలి**

– జస్టిస్ రాధారాణి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

మనం పెరిగిన వాతావరణం, సామాజిక పరిస్థితుల వల్ల మహిళల పట్ల మనలో కొన్ని పక్షపాత భావనలు, అభిప్రాయాలు ఏర్పడతాయి. అలాంటి మూస ధోరణులను, కాలం చెల్లిన భావనలను 'హ్యాండ్ బుక్ ఆన్ కంబాటింగ్ జెండర్ స్టీరియో టైప్స్' క్షుణ్ణంగా చర్చించింది.

ఇందులోని ప్రతి పదం, ప్రతి పుట చాలా కీలకమైనది. ప్రతి ఒక్కరూ దీన్ని చూడాలి. అర్థం చేసుకోవాలి. తద్వారా సమాజ అభివృద్ధికి ప్రతిబంధకాలుగా మారిన పాత భావనల నుంచి బయట పడటానికి ప్రయత్నించాలి. న్యాయమూర్తులు

నిన్ను పదేపదే వేధించే వారివల్ల నీ ఆత్మబలం పెరుగుతున్నట్టు , వారి బలం క్షీణిస్తున్నట్టు...



కూడా సమాజంలో భాగమే.

కనుక వాళ్లలోనూ మహిళల పట్ల కొన్ని అభిప్రాయాలు బలంగా నాటుకొని వుండటం చూస్తుంటాం. వాటిని వదిలించుకోవడానికిది ఉపయోగపడుతుంది. ఈ హ్యాండ్ బుక్‌లో కొన్ని తీర్పులను కూడా ఉదాహరించారు. ఏ తీర్పులో స్టీరియో టైప్ పదాలను వాడారో కూడా ప్రస్తావించారు. దాంతో పాటు పక్షపాత భావనల నుంచి ఎలా బయటపడాలో కూడా చక్కగా మార్గనిర్దేశం చేశారు.

ఇవాళ రాజకీయ పార్టీలు కూడా మహిళల పట్ల కొన్నిరకాల భావనలు కలిగి ఉన్నాయి కనుకే, తక్కువ సీట్లు కేటాయిస్తున్నారు. అలా కాకుండా, మహిళలను సమానత్వ భావనతో చూడటం అవసరం. ప్రతి ఒక్కరూ హ్యాండ్ బుక్ లోని పదాల వెనుక భావాన్ని అర్థం చేసుకోవాలి. మనలోని సంకుచిత తత్వాన్ని వదిలించుకోవాలి.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

# జమ్మికుంట రైతుకు ఉత్తమ రైతు పురస్కారం !

ప్రకృతి వ్యవసాయం చేస్తూ, 150 రకాల వరి వంగడాలను కాపాడుతున్న కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన శ్రీ గారంపల్లి శ్రీకాంత్‌ను తమిళనాడులోని 'ఈశా ఫౌండేషన్' బెస్ట్ ఫార్మర్ అవార్డు వరించింది.



ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు ఆధ్వర్యంలో 'సేవ్ సాయిల్' కార్యక్రమం ద్వారా ఈ సంస్థ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నది. నేల సంరక్షణకు కోసం పాటుపడుతున్నది. అందులో భాగంగా గత నెల 26న 'భారతీయ సంప్రదాయ బియ్యం పండుగ' అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 5వేల మంది ప్రకృతి వ్యవసాయ రైతులకు ఆహ్వానం పలికారు. ఇందులో పాల్గొన్న శ్రీ గారంపల్లి శ్రీకాంత్ ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లిలో తాను సాగు చేస్తున్న విధానాలను వివరించారు. తాను కాపాడుతున్న 150 రకాల వరి వంగడాలను అందజేశారు.

శ్రీకాంత్‌ను సాగు విధానాన్ని వారు అభినందించారు. జులై 30న జరిగిన కార్యక్రమంలో తెలంగాణ నుంచి బెస్ట్ ఫార్మర్ అవార్డుకు శ్రీకాంత్‌ను ఎంపిక చేయగా, అవార్డును కార్యక్రమ నిర్వాహకుడు శ్రీముగ అందించారు. కాగా, ఉత్తమ రైతు అవార్డును అందుకున్న శ్రీకాంత్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

■

చుట్టూ చూడగలిగినవారు కలలు కంటారు , తమ గుండె లోతులు చూడగలిగినవారు మేల్కొంటారు

# బాలల, మహిళల సేవలో ‘అవని’ అనూరాధ!

‘వ్యక్తుల ఎదుగుదలకు బాల్యంలోని అనుభవాలే పునాదులవుతాయి. ఆ బాల్యాన్ని దోపిడీకీ, వేధింపులకూ గురి చేస్తే... పిల్లలే కాదు, సమాజం కూడా నష్టపోతుంది. అందరం దుష్ఫలితాలను అనుభవించాల్సి ఉంటుంది” అని హెచ్చరిస్తారు అనురాధ భోసాలే. బాలలు, మహిళల హక్కుల కోసం, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం 28 ఏళ్ళుగా ఆమె సాగిస్తున్న అవిశ్రాంత పోరాటం వేల మందికి కొత్త జీవితాన్నిచ్చింది. ఇళ్ళలో పనిమనిషిగా ప్రారంభమై... సేవానిరతికి చిహ్నంగా నిలిచిన తన స్ఫూర్తిమంతమైన ప్రయాణం గురించి అనురాధ ఏం చెబుతున్నారంటే...



అవని... అంటే ‘భూమి’ అనే అర్థం అందరికీ తెలుసు. కానీ 1995లో ఒక సంస్థను ప్రారంభించాలని మేము అనుకున్నప్పుడు... ‘ఏ పేరు పెట్టాలా?’ అని ఆలోచించాం. అన్నం, వస్త్రం, నివాసం... ఇవి అందరికీ కావాలి. అలాగే భూమి కూడా అన్ని జీవరాశులదీ. అందరికోసం పనిచేసేదిగా మా సంస్థను తీర్చిదిద్దాలనే సంకల్పంతో... ఆ మూడు పదాల మొదటి అక్షరాలతో ‘అవని’ అని నామకరణం చేశాం. లాభాపేక్ష, పక్షపాతం లేకుండా ఒక సంస్థను నడిపించడానికి భూమికి ఉన్నంత సహనం కావాలని క్రమంగా అర్థమయింది.

**సీటు ఇవ్వడానికి ఒప్పుకోలేదు...**

నేను పుట్టిందీ, పెరిగిందీ మహారాష్ట్రలోని శ్రీరామ్‌పూర్‌లో. మాది ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం. మా తల్లితండ్రుల పన్నెండుమంది సంతానంలో నేను పదకొండోదాన్ని. నాన్న సంపాదన సరిపోయేది కాదు. అమ్మ ఇళ్ళలో పాచి పని చేసేది. ఆరేళ్ళ వయసులో నేను కూడా ఇళ్ళలో పనులకు వెళ్ళాల్సి వచ్చింది. నాకు బాగా చదువుకోవాలని ఉండేది. ఈ సంగతి నేను పని చేస్తున్న ఇంటి వాళ్ళు తెలుసుకున్నారు. నాకు భోజనం పెట్టి, చదువుకోవడానికి వీలు కల్పించారు. అయితే నేను అయిదోక్లాస్‌కు వచ్చేసరికి మా కుటుంబ పరిస్థితులు మరింత దిగజారాయి. దాంతో మా స్వగ్రామమైన అహ్మద్‌నగర్‌లోని భోకార్‌కు మా కుటుంబం మారిపోయింది.

నేను మాత్రం చదువు మానేది లేదంటూ... మా టీచర్ల సాయంతో గర్ల్స్ హాస్టల్‌లోకి మారిపోయాను. అప్పట్లో ఏడాదికి పాతిక రూపాయల ఫీజు. దాన్ని మా టీచర్లే కట్టేవారు. నా కాలేజీ చదువుల కోసం స్థానిక చర్చి వాళ్ళు సహాయం చేశారు. కాలేజీ విద్యార్థినిగా ఉన్నప్పుడు స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేశాను. ఎక్కడెక్కడినుంచో వలస వచ్చిన భవన నిర్మాణ కూలీల పిల్లలను బడిలో చేర్పించడం, మహిళలతో స్వయం సహాయ బృందాలు ఏర్పాటు చేయించి... రుణాలు అందేలా చూడడం లాంటివి చేసేదాన్ని. కానీ ‘కాలేజీ ఆఫ్ సోషల్ వర్క్’లో మాస్టర్స్ డిగ్రీలో చేరాలనుకున్నప్పుడు... నాకు ఇంగ్లీషు అంతగా రాదంటూ సీటు ఇవ్వడానికి మొదట తిరస్కరించారు.

“సమాజానికి ఏదైనా చెయ్యాలనే కోరికతోనే ఈ కోర్సును ఎంచుకున్నాను. అవకాశం ఇస్తే ఇంగ్లీష్ బాగా నేర్చుకుంటాను” అని వారికి చెప్పి ఒప్పించాను. చదువు పూర్తయ్యాక పుణేలో ఒక కంపెనీకి చెందిన సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్‌లో చేరాను. ‘కార్పొరేట్ సామాజిక బాధ్యత’గా ఆ కంపెనీ పశ్చిమ మహారాష్ట్ర వ్యాప్తంగా 124 గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్య, పర్యావరణ ప్రాజెక్టులను పర్యవేక్షించాను.

**చంపుతానన్నవారే విరాళాలిచ్చారు...**

అప్పటికే కొన్ని స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న డాక్టర్ అరుణ్ చవాన్ పూర్తిస్థాయిలో మహిళలు, పిల్లల సేవకు కోసం ‘అవని’ సంస్థకు పునాదులు వేశారు. ఆ సంస్థలో వ్యవస్థాపక ఉద్యోగినిగా చేరాను. అయిదేళ్ళపాటు ఆ సంస్థ తరఫున నేనొక్కరినే పనిచేశాను. ఆ తరువాత ఔత్సాహికులను

సిబ్బందిగా నియమించుకున్నాం. వలస కుటుంబాలకు మైక్రో ఫైనాన్స్ అందించడంతో పాటు వారి పిల్లలకు... యాభై మందికి ఒకటి చొప్పున 36 పాఠశాలలు ఏర్పాటు చేశాం. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం 'అవని' నాటి నుంచి నేటి వరకూ నిర్విరామంగా పని చేస్తోంది. వారికి విద్య, వైద్యం, ఆహారం అందేలా చూస్తోంది. బాలల అక్రమ రవాణా, ఆడ బిడ్డలు పుట్టకుండా గర్భస్రావాలు లాంటివి అరికట్టడానికి పాటుపడుతోంది. వితంతువులైన, విడాకులు తీసుకున్న, భర్తలు వదిలేసిన మహిళలకు విద్య, ఉపాధి కల్పన కోసం, వారి పిల్లల సంక్షేమం కోసం మహిళలు, బాలల హక్కుల ప్రచారం (విమెన్ అండ్ ఛైల్డ్ రైట్స్ క్యాంపెయిన్) ప్రారంభించాం. దీని ద్వారా సుమారు నాలుగువేల మంది మహిళలకు సాయం అందించాం.

1995 నుంచి వేలాది బాలకార్మికులకు విముక్తి కల్పించాం. మనం గమనించినట్లయితే కాఫీ హొటళ్ళు, మెకానిక్ షెడ్లు మొదలుకొని ప్రతి చోటా బాల కార్మికులు కనిపిస్తారు. వీధుల్లో పిల్లలతో బిచ్చమెత్తించే మాఫియాలుకూడా ఉన్నాయి. ఇక, పిల్లలకు రోజుకు ఇరవై రూపాయలు ఇచ్చి...పన్నెండేసి గంటల పాటు ఇటుక బట్టీల్లో పని చేయించడం మా ప్రాంతంలో ఎక్కువగా ఉండేది.. స్థానిక పెద్దలు, పోలీసుల సహకారంతో వందలమంది పిల్లలను విడుదల చేయించాం. వారిని బడుల్లో చేర్పించాం. క్రమంగా యజమానుల్లోనూ మార్పు వచ్చింది. మొదట్లో నన్ను చంపుతానని బెదిరించిన ఒక ఇటుకలబట్టీ ఆసామీ.... మా బడి నిర్మాణానికి 7 వేల ఇటుకలు విరాళంగా ఇచ్చారు. మరోవైపు 'అవని' సారథ్యంతో మహిళలకు నైపుణ్య,ఉపాధి శిక్షణ కేంద్రాలు, వారి పిల్లలకు డేకేర్ సెంటర్లు నిర్వహిస్తున్నాం.

**అదే నా కల...**

కొవిడ్ సమయంలో 'అవని' చేసిన సేవలు సర్వత్రా ప్రశంసలు అందుకున్నాయి. ఈ క్రమంలో మా సంస్థ ఎన్నో ప్రతిష్టాత్మకమైన పురస్కారాలు అందుకుంది. వ్యక్తిగతంగా నేను 'ఉమెన్ హ్యావ్ వింగ్స్ అవార్డ్' లాంటివి అనేకం అందుకున్నాను. పలు రాష్ట్రాల్లో క్యాన్సర్ రోగులకు సేవలు అందించిన భాస్కర్ లాల్ పవార్ పేరిట ఈ ఏడాది ఏర్పాటు చేసిన జీవన సాఫల్య పురస్కారాన్ని తొలిసారిగా నాకు బహూకరించారు. గత ఇరవై ఎనిమిదేళ్ళలో ఎనభై వేలకు పైగా పిల్లలకు సాయపడడం, వారు గౌరవంగా, సాధికారతతో జీవించడానికి మార్గం చూపించడం నాకు ఎంతో సంతృప్తినిస్తోంది. ప్రస్తుతం 'అవని' అధ్యక్షురాలుగా కొనసాగుతున్న నా జీవితం... ఇళ్ళలో ఇంట్లో పాచిపనులు చేసే బాల కార్మికురాలుగా మొదలయింది.

ప్రేమించి పెళ్ళాడిన భర్త నుంచీ, అతని కుటుంబం నుంచీ వేధింపులు ఎదుర్కొని, ఇద్దరు పిల్లలతో అవమానకరమైన పరిస్థితుల్లో బయటకు రావాల్సి వచ్చింది. కాబట్టి నేను ఏ సమస్యలకు వ్యతిరేకంగా పోరాడుతున్నానో... అవి నేను స్వయంగా అనుభవించినవే. ఆ సమస్యలు లేని సమాజం నా కల. అది నెరవేరడం కోసం 'అవని' ద్వారా కృషి చేస్తూనే ఉంటాను." ■

## వరిలో చీడపీడల నివారణ


**తె**లంగాణ ప్రాంతంలో కొన్ని చోట్ల ఇప్పటికి వరినాట్లు పడుతుండగా, మరికొన్ని చోట్ల వరి నారుమడులు పోసుకుంటున్నారు. అయితే సన్నగింజ రకాలకు అధికంగా చీడపీడలు ఆశించే అవకాశం ఉండటంతో తొలిదశలోనే వాటిని అరికట్టినట్లైతే అధిక దిగుబడులు పొందేందుకు అవకాశం వుంటుంది. ప్రస్తుతం వరిలో చేపట్టాల్సిన సస్య రక్షణ చర్యల గురించి తెలియజేస్తున్నారు వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. ఎస్.మాలతి. దాదాపు 44 లక్షల ఎకరాల్లో సాగవుతున్న ఈ పంటలను ఈసారి సన్నగింజ రకాలు 60 శాతం, దొడ్డు గింజ రకాలను 40 శాతం విస్తీర్ణంలో పండించాలని ప్రభుత్వం సూచించింది. అయితే సన్న గింజ రకాలకు అధికంగా చీడపీడలు ఆశించే అవకాశం ఉండటంతో తొలిదశలోనే వాటిని అరికట్టినట్లైతే అధిక దిగుబడులు పొందేందుకు అవకాశం ఉంటుంది. గత రబీలో కాటుక తెగులు అధికంగా ఆశించింది. ఈ ఖరీఫ్ లో ముందస్తు చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని సూచిస్తున్నారు . ■

ఒకరిని అంచనావేయడం వల్ల వారెలాంటివారో తెలిసే కన్న నీవెలాంటివాడివో తెలుస్తుంది.

# నేల ఆరోగ్యం - ఉత్పాదకత పెంపుదల

ఆరోగ్యంగా ఉన్న నేలకు ప్రతికూల పరిస్థితులను తట్టుకునే బలం ఉంటుంది
నేల ఆరోగ్యంగా ఉండాలంటే, అందులో తగినంత సేంద్రియ పదార్థం ఉండాలి

## చేపట్టే పనులు




NABARD

MAHILA SADHIKARATHA
Publication Date: 01-09-2023 ; Posting Date: 05 & 06-09-2023

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23

## ఏపిమాస్ 22 వ వార్షిక మహాసభ దృశ్యం



## ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో జెండా పండుగ



## మూడు రాష్ట్రాలలో ఎఫ్ పి ఓలకు ఎస్ బి ఐ తో అనుసంధానం ... మరికొన్ని దృశ్యాలు







తిరుపతి ... ఆంధ్రప్రదేశ్









పాట్నా ... బీహార్







హైదరాబాద్ ... తెలంగాణా

To ADDRESS



హైదరాబాదులో ఏపిమాస్ సిబ్బందికి బ్రహ్మకుమారీల రక్షా బంధన్ !

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089